PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 119 | విజయవాడ, ఆదివారం 1 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 1 December 2024 | Rs

పత్తి రైతుకు ఇ-క్రాప్ చిక్కులు!

- కొనుగోలుకు నిరాకరిస్తున్న అధికారులు
- ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి

3



తొలి రోజు వర్షార్పణం

- కాన్‌బెర్రాలో ఎడతెగని వర్షం
- నేడు 50 ఓవర్ల వార్మప్‌కు అవకాశం

8

తీరం దాటిన తుపాన్

- తిరుపతిలో కుండపోత
- భారీ వర్షాలతో పాటు ఆకస్మిక వరదల హెచ్చరిక
- అప్రమత్తంగా ఉండండి : సిఎం ఆదేశం
- 'సోమశిల' ఇన్‌ఫ్లోపై నిరంతరం నిఘా
- శ్రీలంకలో 25 మంది మృతి
- తమిళనాడులో భారీ వర్షాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమిళనాడుతో పాటు దక్షిణకోస్తాను వణికించిన ఫెంగల్ తుపాన్ తీరాన్ని దాటింది. శనివారం అర్ధరాత్రి దాటినతరువాత పుదుచ్చేరి సమీపంలో తుపాన్ తీరాన్ని దాటినట్టు వాతావరణ శాఖ తెలిపింది. తీరం దాటే సమయంలో 70 నుండి 80 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం 90 కి.మీ దాటినట్లు వార్తలు వచ్చాయి. ఉధృత గాలుల దాటికి తీరంలోని అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అంతకు ముందు మహాబలిపురం-కరైకల్ మధ్య తీరం దాటే ప్రక్రియ రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైంది. తీరం దాటే సమయంలోనూ ఆ తరువాత 24 గంటల పాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలతో పాటు తమిళనాడు, పుదుచ్చేరిలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. రాయలసీమ లోని ఒకటి, రెండు జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పెన్నా పరివాహక ప్రాంతంలో అకస్మిక వరదల (ఫ్లాష్ ఫ్లడ్స్) ప్రమాదం ఉందని హెచ్చరించింది. శనివారం సాయంత్రం నుండే నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ ఈదురుగాలులు వీస్తున్నట్లు వార్తలు వచ్చాయి. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల హెచ్చరికల నేపథ్యం లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితిని ఎప్పటి కప్పుడు అంచనా వేసి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆకస్మిక వరదల హెచ్చరిక నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు డిజాస్టర్ టీమ్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సిఎం పేర్కొన్నారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందునుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీలంకలో బీభత్సం...తమిళనాడులో ముగ్గురు మృతి తుపాను ప్రభావం తమిళనాడుతో పాటు, శ్రీలంకపైన తీవ్రంగా పడింది. శ్రీలంకలోని ఈస్టరన్ ప్రావిన్స్‌లో తుపాన్ బీభత్సం సృష్టించింది. ఈ ప్రాంతంలో భారీ వర్షాలతో పాటు, ఈదురు గాలుల తీవ్రత ప్రజలను అతకలాకుతలం చేసింది. వర్షాలు, వరదల బారిన పడి 15 మంది మరణించారు. వీరిలో పిల్లలు కూడా ఉన్నట్లు సమాచారం. 4.50 లక్షల మంది నిరాశ్రయులైనట్లు శ్రీలంక ప్రభుత్వం తెలిపింది. రంగంలోకి దిగిన ఆర్మీ సహాయక చర్యలను చేపట్టింది. మనదేశంలోని తమిళనాడులోని తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై నగరంలో చలిగాలులకు తట్టుకోలేక ముగ్గురు మృతి చెందారు. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. తమిళనాడులోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది.



తిరుపతి జిల్లా నారాయణవరం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న అరణియార్ వాగు

తిరుపతి, నెల్లూరులో భారీ వర్షం

తుపాన్ కారణంగా రాష్ట్రంలోని తిరుపతిలో కుండపోత వర్షం కురిసింది. నెల్లూరు జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతిలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకూ గాలివాన బీభత్సం సృష్టించింది. తిరుమలలో పాపవినాశనం, శ్రీవారి మెట్టు మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. తడ మండలంలో అత్యధికంగా 120.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో స్వర్ణముఖి నది నీటిమట్టం పూర్తిస్థాయికి చేరింది. ఎన్‌టిఆర్ జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో, నీవా నది పరివాహక ప్రాంతాల్లో


మిగతా 2లో



అక్రమ ఇసుక తవ్వకాలపై జాతీయ స్థాయి మార్గదర్శకాలు

- హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు

న్యూఢిల్లీ : ఇసుక తవ్వకాలను అక్రమంగా చేపట్టే చర్యలను నివారించేందుకు మూడు నెలల్లోగా జాతీయ స్థాయిలో మార్గదర్శకాలు రూపొందించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి)కు ఎన్‌జిటి శుక్రవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. అక్రమ ఇసుక తవ్వకాలపై ఇచ్చిన తీర్పు సందర్భంగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. యుపిలో సిల్కోసిస్ వంటి వివిధ రకాల వ్యాధులతో ప్రజారోగ్యానికి ముప్పు కలుగుతోందని పేర్కొంది. సిలికా ఇసుక గనుల నుండి సిలికా ఇసుకను వెలికితీయడం వల్ల కార్మికులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని అందువల్ల ఆ రంగంలో పనిచేసే కార్మికులకు సామాజిక, వైద్య సంక్షేమ చర్యలను చేపట్టాలని కోర్టు పేర్కొంది. యుపి రాష్ట్ర ప్రభుత్వం, యుపిపిసిబిలు సంబంధిత విభాగాలతో చర్చలు జరిపి, తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని కోరింది. బాధిత కార్మికులకు చికిత్స, ముందస్తు జాగ్రత్తల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. ఇసుక గనుల తవ్వకాలను అక్రంగా చేపట్టే వివిధ ప్రైవేటు కంపెనీలకు పెనాల్టీలను కూడా విధించింది.



పేదల సేవలో భాగంగా పర్యటన చేసిన ప్రజావేదికలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రతి నియోజకవర్గానికీ ఒక ఇండస్ట్రియల్ పార్క్

నేమకల్లులో 'పేదల సేవ'లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- అనంతపురం, బొమ్మనహాల్

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం నేమకల్లులో శనివారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమానికి ఆయన హాజరై లబ్ధిదారులకు సామాజిక పింఛను అందజేశారు.

విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో జిందాల్ విజయనగర ఎయిర్ పోర్టుకు వచ్చిన చంద్రబాబు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నేమకల్లుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మొదట గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు పింఛను అందజేసిన ముఖ్యమంత్రి గ్రామంలోని నేమకల్లు ఆంజనేయస్వామి పురాతన ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన 'పేదల సేవలో' ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఉపాధి కోసం యువత ఎక్కడో దూరప్రాంతాలకు వెళ్లకుండా వారి నియోజకవర్గ పరిధిలోనే ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వరాల జల్లు

రాయదుర్గం నియోజకవర్గానికి చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. బైరవానితిప్ప ప్రాజెక్టును హంద్రీనీవా నీటితో నింపుతామని ప్రకటించారు. ఆ నీటితో ఇంటింటికీ కుళాయి పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఇండస్ట్రియల్ పార్క్, నేమకల్లు, ఉంతకల్లు మధ్యలో ఐదు టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఐరన్ ఎక్కువగా లభ్యమవుతున్న నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నేమకల్లులోని ఆంజనేయస్వామి ఆలయ గోపురాల అభివృద్ధికి రూ.3 కోట్ల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నేమకల్లు పర్యటన అనంతరం హెలీప్యాడ్ వద్ద జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సిఎం చంద్రబాబు సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధిపై సమీక్షించారు. రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాకట్టు చెరలో స్వర్ణం

- ఏడు నెలల్లో బంగారం రుణాలు 50% పెరుగుదల
- ఆదాయాల్లో తగ్గుదల ఫలితం!

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

ఎన్నో ఆశలు, సంతోషాలతో కొనుక్కునే స్వర్ణం తాకట్టు పడుతోంది. దేశంలో తగ్గిన ఆదాయాలు, భారీగా పెరిగిన ఖర్చులు పసిడి తనఖాకు దారితీస్తున్నాయి. ఏడాది కాలంలో అమాంతం పెరుగుతోన్న వ్యయాలను తట్టుకోవడానికి ప్రజలు ఉన్న బంగారాన్ని భారీగా కుదువ పెట్టేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో పసిడి అప్పులు ఏకంగా 50.4 శాతం ఎగిసి రూ.1,54,282 కోట్లకు చేరాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఈ రుణాల విలువ రూ.1,02,562 కోట్లుగా ఉంది. విద్య, వైద్యం, వ్యక్తిగత, వ్యవసాయ అవసరాలు తీర్చుకోవడానికి ప్రజలు బంగారం రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)లు అన్ సెక్యూర్డ్ రుణాల కంటే సెక్యూర్డ్ రుణాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. పసిడి రుణాలకు డిమాండ్ పెరగడానికి ప్రజలు ఆర్థికంగా దెబ్బతినడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పెరిగిన క్రెడిట్ కార్డు రుణాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలల్లో వ్యక్తిగత రుణాలు 5.6 శాతం పెరిగాయి. గృహ రుణాలు 12.1 శాతం పెరిగి రూ.28.7 లక్షల కోట్లకు చేరాయి. క్రెడిట్ కార్డులపై రుణాలు 9.2 శాతం పెరిగి రూ.2.81 లక్షల కోట్లకు చేరాయి. అన్‌సెక్యూర్డ్ రుణాలు 3.3 శాతం తగ్గాయి. తొలి ఏడు నెలల్లో బ్యాంక్ రుణాల జారీ 4.9 శాతం పెరిగి రూ.172.4 లక్షల కోట్లుగా నమోదైంది.

ఇఎంఐలకు ఆర్‌బిఐ ఆదేశం

రుణగ్రహీతలను కుదువ సంస్థలు మోసానికి గురిచేస్తుండటం, పసిడి విలువ నిర్ధారణలో లోపాలు, వేలంలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు ఆర్‌బిఐ దృష్టికి వెళ్లాయి. కొందరు వడ్డీ చెల్లించి బంగారం రుణాలను దీర్ఘకాలం కొనసాగిస్తున్నట్లు గుర్తించింది. ఇప్పటి వరకు ఇఎంఐ (నెల వారీ వాయిదాలు) చెల్లించే పద్ధతి లేక అనేక మంది ఏకకాలంలో అప్పులు చెల్లించలేక పసిడిని వదిలేసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటు న్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఆర్‌బిఐ రుణగ్రహీతలకు ఇఎంఐలకు అవకాశం ఇచ్చేలా ఓ విధానాన్ని రూపొందించుకోవాలని విత్త సంస్థలను ఆదేశించింది.



ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి ఇకలేరు

- ఎన్నారై ఆస్పత్రికి భౌతికకాయం అప్పగింత

2

'మీగడ'కు గురజాడ విశిష్ట పురస్కారం

- ప్రదానం చేసిన సుప్రీంకోర్టు మాజీ సిజెఐ ఎన్‌వి రమణ

3

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలొద్దు

- అదానీతో ఒప్పందాలు రద్దు చేయాలి
- సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో రామకృష్ణ, బాబూరావు, వైవి తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సెకి ఒప్పందం వల్ల ప్రజలపై లక్షల కోట్ల భారం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంపై టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సెకి ఒప్పందంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ అవినీతిలో టిడిపి కూటమికి కూడా భాగం ఉందని భావించాల్సి ఉంటుందని చెప్పారు. 'ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు, అదానితో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, అదానీపై విచారణ జరిపి శిక్షించాలని' సిపిఎం విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్రకమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాశక్తి ప్రచురించిన 'అవినీతి కిలాడీలు- రక్షణలో పాలకులు' అనే ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మోదాని పాలన నడుస్తోందని, వీరిద్దరికి మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్ జత కలిశారని విమర్శించారు. ముగ్గురు కలిసి లక్షల కోట్ల భారాన్ని రాష్ట్రంపై రుద్దారని చెప్పారు. అదాని కోసం సెకిని మోడీ దళారీగా మార్చారని విమర్శించారు. అదాని విషయంలో జగన్‌తో సైతం రాజీపడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధపడ్డారని తెలిపారు. సెకి ఒప్పందంపై అధ్యయనం చేస్తున్నామని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు పెట్టిన స్మార్ట్‌మీటర్లను పగలకొట్టాలని ప్రతిపక్షంలో పిలుపునిచ్చిన చంద్రబాబు ఇప్పుడు వాటిని సమర్ధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మీటర్లను టిడిపి కూడా కొనసాగిస్తే అదాని, షిర్డిసాయి నుంచి లంచాలు తీసుకుందని భావించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ నాటికి 3వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తామని సెకి ఒప్పందంలో ఉందని, ఇప్పటికీ ఒక్క యూనిట్ కూడా అందలేదన్నారు. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు అదానిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అదాని రూ.2వేల కోట్ల లంచం ఇచ్చి 25 ఏళ్ల పాటు రాష్ట్రప్రజలపై లక్షల కోట్ల భారం మోపారని విమర్శించారు. ఇప్పటికే

మిగతా 2లో

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

ఏడుగురు దుర్మరణం

- మృతుల్లో భార్యాభర్తలు
- కుమారుడి మరణ వార్త తెలిసి గుండెపోటుతో తల్లి మృతి

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం), కంకిపాడు (కృష్ణా జిల్లా)

రాష్ట్రంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో భార్యభర్తలు ఉన్నారు. కుమారుడి మరణ వార్త తెలిసి ఓ తల్లి గుండెపోటుతో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలతో సహా నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వారంతా శ్రీకాకుళం పట్టణానికి చెందిన వారు. వడ్డే అభినవ్ (27), మణిమాల (24) దంపతులు. విశాఖపట్నంలో మణిమాల శనివారం ఐబిపిఎస్ మెయిన్స్ పరీక్ష రాయాల్సి ఉంది. అభినవ్‌కు శ్రీకాకుళం పట్టణానికి చెందిన గవిడి కౌశిక్ (27) స్నేహితుడు. కౌశిక్ తన మేనమామ అమెరికా నుంచి వస్తుండడంతో ఆయనను తీసుకొచ్చేందుకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. విశాఖపట్నం వెళ్లేందుకు అభినవ్, మణిమాల దంపతులు కూడా ఈ కారు ఎక్కారు. పోలిపల్లి వద్ద కారు టైర్ పేలడంతో అదుపు తప్పి పల్టీ కొట్టింది. విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే మార్గంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో, ఈ ముగ్గురితోపాటు కారు డ్రైవర్ జయేష్ (20) కూడా అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీయించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అభినవ్, మణిమాల దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కౌశిక్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది. జయేష్ చిన్నప్పుడే తండ్రి మరణించడంతో తల్లి టీ కొట్టు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శ్రీకాకుళం పట్టణంలో కౌశిక్ బంగారం షాపు, అభినవ్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు.



భోగాపురం పోలిపల్లి వద్ద ప్రమాదానికి గురైన కారు

కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు వద్ద చేపల వ్యాన్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు మరణించారు. మృతుల్లో మచిలీపట్నం బలరాంపేటకు చెందిన చీలి ప్రభు (30), చీలి భానుప్రకాశ్ (26), చింత రవి (36) ఉన్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు టైరు పేలడంతో డివైడర్‌ను దాటుకుని వెళ్లి చేపల వ్యాన్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారు నుజ్జునుజ్జు అయింది. చేపల వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. వ్యాన్‌లో ఇరుక్కుపోయిన ఆయనను క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, భానుప్రకాశ్ మృతి వార్త తెలుసుకున్న ఆయన తల్లి సుధారాణి గుండెపోటుతో మరణించారు.

విద్యుత్ భారాన్ని ఉపసంహరించాలి

నిరసనలకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై శుక్రవారం మోపిన రూ.9,412 కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే విధించిన రూ.6,029 కోట్ల వసూలు డిసెంబర్ నుండి ప్రారంభం అవుతుండగా, మరలా ఈ భారం వేయడం దారుణమన్నారు. ఎపిఇఆర్‌సి కనీసం పబ్లిక్ హియరింగ్ కూడా నిర్వహించకుండా ఏకపక్షంగా ట్రూఅప్ విధించడం అన్యాయమని, చట్టవిరుద్ధమని విమర్శించారు. పారదర్శకత గురించి, వినియోగదారుల ప్రయోజనాలు కాపాడుతామని గొప్పలు చెప్పే పాలకులు ఇలాంటి నిరంకుశ పోకడలకు స్వస్తి పలకాలని పేర్కొన్నారు. అదాని కుంభకోణం వెల్లడైన నేపథ్యంలో అదనపు ఛార్జీలు కార్పొరేట్ల లాభాపేక్ష కోసమేనని రుజువైందని తెలిపారు. ఈ భారాలను ప్రజలు భరించాల్సిన అవసరం లేదని, తాజా ప్రతిపాదన వల్ల 2025 జనవరి నెల బిల్లు నుండి రెండేళ్ల పాటు నెలనెలా యూనిట్‌కు రూ.0.45 నుండి రూ.0.46 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. టారిఫ్ ఆర్డర్ ప్రకారం నెలకు 30 యూనిట్లు వాడే నిరుపేదలు ఇంధన ఛార్జీగా రూ.1.90 నిర్ణయించగా, ట్రూఅప్ ఛార్జీగా యూనిట్‌కు రూ.1.73 అదనంగా చెల్లించాల్సి వస్తుందని వివరించారు. దీనివల్ల పెంపుదల 91 శాతం అవుతుందని, చార్జీ యూనిట్‌కు రూ.3.63 అవుతుందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసిన టిడిపి కూటమి గద్దెనెక్కాక మాట నిలబెట్టుకోలేదని, ఎప్పుడో వాడిన కరెంటుకు ఇప్పుడు అదనంగా డబ్బు చెల్లించాలన్న ట్రూఅప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ తప్పుడు విధానాలతో తెగతెంపులు చేసుకోవాలని కోరారు.

ప్రతి దాడి మమ్మల్ని మరింత బలోపేతం చేస్తుంది

- ముడుపుల ఆరోపణలపై నోరు విప్పిన అదాని



న్యూఢిల్లీ: రెండు వారాల కిందట అమెరికా న్యాయశాఖ తనపై చేసిన ఆర్థిక నేరాభియోగాలపై అదాని గ్రూపు సంస్థల అధినేత, వివాదాస్పద వ్యాపార వేత్త గౌతమ్ అదానీ ఎట్టకేలకు నోరు విప్పారు. అమెరికా చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, వాటిని కోర్టులో సవాల్ చేసే అంశం పరిశీలిస్తానని చెప్పారు. ఇటువంటి దాడులు తమపై జరగడం ఇదే మొదటి సారి కాదని, ఇలాంటివి ఇంతకుముందు కూడా ఎదుర్కొన్నామని అంటూ, "ప్రతి దాడి మమ్మల్ని మరింత బలోపేతం చేస్తుంది" అని ఆయన సెలవిచ్చారు. జైపూర్‌లో శనివారం నిర్వహించిన ఓ అవార్డుల వేడుక కార్యక్రమంలో ఆయన ఆన్‌లైన్‌లో పాల్గొంటూ ఈ వ్యాఖ్యలు చేశారు. అదానీ గ్రూపు సంస్థలు సోలార్ ప్రాజెక్టు టెండర్లను చేజిక్కించుకోడానికి, భారత్‌లో రూ. 2029 కోట్ల మేర ముడుపులు ముట్టచెప్పారని న్యూయార్క్ కోర్టులో అభియోగం మోపిన సంగతి తెలిసిందే.

దేవాదాయశాఖ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- మంత్రి ఆనంకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేవాదాయశాఖలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న... దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని టిడిపి కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఖాళీ పోస్టులను ఎపిపిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని కోరారు. గ్రేడ్-3 ఇఒ పోస్టుల భర్తీ విషయంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. మొత్తం పోస్టులను జూనియర్ అసిస్టెంట్ ద్వారా భర్తీ చేసేందుకు నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణల్లో ఉన్న వేల ఎకరాల ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. తప్పుడు పద్ధతిలో ఇచ్చిన స్థలాలు, దుకాణాలు, అక్రమ లైసెన్సుల కేటాయింపుల్లో అక్రమాలను అరికట్టాలని, ఇచ్చిన లీజులను రద్దు చేయాలని అన్నారు.

ఛార్జీలు పెంచినందుకా జగన్‌కు సన్మానం

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచినందుకు సన్మానించాలా? అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసినందుకు, అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లినందుకు శాలువా కప్పాలా? అంటూ శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడూ లేని విధంగా గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్యులపై మోయలేని భారాన్ని వేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఎఆర్ఆర్‌కు గడువు ఇవ్వండి!

- ఇఆర్‌సికి డిస్కంల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదాయ, వార్షిక నివేదిక (ఎఆర్ఆర్) సమర్పించేందుకు గడువు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)ని విద్యుత్ పంపిణీ సంస్థలు కోరినట్లు సమాచారం.

ప్రతియేటా రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎఆర్ఆర్‌ను డిస్కంలు నవంబర్ 30వ తేదీలోపు సమర్పించాల్సి ఉంది. రానున్న ఆర్థిక సంవత్సరం (2024-25) ఎఆర్ఆర్‌ను కూడా శనివారంలోపు డిస్కంలు సమర్పించాల్సి ఉండగా, సమర్పించలేదని విశ్వసనీయంగా తెలిసింది. మరో రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలను సమర్పిస్తామని ఇఆర్‌సికి లేఖ రాసినట్లు సమాచారం.

జత్వానీ కేసులో పోలీస్ అధికారులకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

- సిఐడి అఫిడవిట్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్న పలువురు పోలీసు అధికారులకు ముందస్తు బెయిల్ మంజూరు చేయరాదని సిఐడి పోలీసులు హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు.

ఐపిఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ, పోలీస్ అధికారులు హనుమంతరావు, సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేయాలని కోరారు. వీళ్లకు ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని చెప్పారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసే చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ముందస్తు బెయిల్ ఇస్తే వీరు సాక్షులపై ఒత్తిడి చేసే ప్రమాదం ఉంటుందన్నారు. విద్యాసాగర్‌తో చేతులు కలిపి కుట్ర చేశారన్నారు. ఆ కుట్రలో న్యాయవాది వెంకటేశ్వర్లు కూడా భాగస్వామి అన్నారు. విద్యాసాగర్‌తో కలిసి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని చెప్పారు. ప్రధాన నిందితుడు విద్యాసాగర్‌కు కూడా బెయిల్ ఇవ్వొద్దని మరో కౌంటర్ దాఖలు చేశారు. ఈ మేరకు సిఐడి ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌పి సరిత కౌంటర్లు దాఖలు చేశారు. వీటిపై హైకోర్టు డిసెంబరు 2న విచారణ చేయనుంది.

భోజనంలో పురుగులు

- నాగార్జున యూనివర్సిటీ విద్యార్థినుల ఆందోళన
- విసి ఛాంబర్ ఎదుట శుక్రవారం రాత్రి నుంచి నిరసన
- త్రిసభ్య కమిటీ విచారణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

నాగార్జున యూనివర్సిటీ మహిళా వసతి గృహంలో వడ్డించిన భోజనంలో పురుగులు రావడంపై శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వందలాది మంది విద్యార్థినులు విసి ఛాంబర్ ఎదుట ఆందోళన చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం, పరీక్షల డ్యూటీకి వార్డెన్ వెళుతుండడంతో విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించింది. ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహన్‌రావు, అధికారి రజిత్ భార్గవ్ హాస్టల్‌ను సందర్శించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, ఫుడ్ కంట్రోలర్ రవీంద్రారెడ్డితో త్రిసభ్య కమిటీని నియమించింది. దీంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. హాస్టల్‌ను కమిటీ శనివారం సందర్శించింది. విద్యార్థినులతో మాట్లాడడంతోపాటు ఆహార పదార్థాలను తనిఖీ చేసి, నమూనాలను సేకరించి పరీక్షలకు పంపింది. పది అంశాలతో



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఉన్నత విద్యా మండలి అధికారులు

కూడిన ఓ పత్రాన్ని చీఫ్ వార్డెన్ వెంకటరత్నంకు ఇచ్చి వివరణ కోరినట్లు తెలిసింది. పలు అంశాలపై వార్డెన్‌తోపాటు వైస్ ఛాన్సలర్ గంగాధరరావు, రిజిస్ట్రార్ జి.సింహాచలంతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంది. ఘటనపై మూడ్రోజుల్లోగా నివేదిస్తామని, విద్యార్థినులతో సోమవారం సమావేశమూ నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. మరోవైపు ఆహారంలో నాణ్యత లేకపోవడం, పరిసరాల అపరిశుభ్రతపై అధికారుల దృష్టికి గతంలోనే తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని, ఫలితంగానే సమస్య తీవ్రత పెరిగిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నవిత చెప్పారు. ఈ సమస్యలపై వర్సిటీ రిజిస్ట్రార్‌కు తాము గతంలో విన్నవించినా చర్యలేమీ తీసుకోలేదని తెలిపారు.

డ్రైవర్ బాబు ఆత్మహత్యాయత్నంపై విచారణ

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవనిగడ్డ డిపో డ్రైవర్ కెఎం బాబు ఆత్మహత్యాయత్నంపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆర్‌టిసిలో అకాల మరణాలకు కారణమవుతున్న వేధింపులు ఆపాలని ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలానీ బాషా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుందరయ్య, అయ్యప్పరెడ్డి శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఇటువంటి చర్యలు జరగకుండా యూనియన్లతో చర్చించి సముచిత నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఒక్క ప్రమాదం కారణంగా డ్రైవర్లు తీవ్ర క్రమశిక్షణ చర్యల నేపథ్యంలోనే కెఎం బాబు ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోందన్నారు. 15 లక్షలకు పైగా కిలోమీటర్లు ప్రయాణించిన బస్సుకు అనేక మెకానికల్ లోపాలు ఉన్నాయని డ్రైవర్లు విన్నవించినా మరమ్మతులు నిర్వహించకుండా ఈ నెల 24న తనకు ఆ బస్సు ఇవ్వడంతోనే ప్రమాదం జరిగిందని బాబు తన స్టేట్‌మెంట్‌లో వెల్లడించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇహెచ్‌ఎస్‌లో చికిత్స తీసుకోవడంతో సిక్ కాలానికి జీతం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అవనిగడ్డ డిపో మేనేజర్ ఉద్దేశపూర్వకంగా ఇవ్వలేదని, తనను కావాలని టార్గెట్ చేశారని కెఎం బాబు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారిగా డిపిటిఒ కూడా వాస్తవాలను పరిశీలించకుండా కెఎం బాబును తీవ్రమైన పదజాలంతో దూషించారని, ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని తన మూడు పేజీల స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారని తెలిపారు. అదేవిధంగా కొవెలకుంట్ల డిపో గ్యారేజీలో బస్సు ప్రమాదంలో మరణించిన అవుట్‌సోర్సింగ్ మెకానిక్ వెంకటరమణ కుటుంబానికి ఆర్‌టిసి యాజమాన్యం న్యాయం చేయాలని, ఎంప్లాయి కాంపెన్సేషన్ చట్టం ప్రకారం తగు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఆర్‌టిసికి స్కాచ్ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ఆర్‌టిసి ప్రతిష్టాత్మకమైన స్కాచ్ అవార్డు సాధించిందని ఆ సంస్థ అధికారులు తెలిపారు. యాప్‌తో నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టిక్కెట్ల జారీ విధానాన్ని అమలు చేయడం, సంస్థలోని అన్ని బస్సులకూ ట్రాకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం వంటి అధునాతన సాంకేతిక విధానాలను అమలు చేయడం వల్ల ఈ అవార్డు లభించిందని సంస్థ ఇడి శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఇంజినీర్ వై శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారని తెలిపారు.

వేధిస్తున్న అధికారులపై చర్యలు

- గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్న క్షేత్రస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు ఎమ్‌డి జాని పాషా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీకి సంబంధించి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 178 మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోపు 94 శాతం పింఛన్ పంపిణీ చేసినా 12 మంది సచివాలయ ఉద్యోగులకు ఉద్దేశపూర్వకంగా చిత్తూరు జిల్లా శాంతిపురం మండల ఎంపిడిఒ నోటీసులు జారీ చేశారన్నారు. అదే విధంగా నూజివీడు, అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలంతో పాటు పలు మండలాల్లో నోటీసులు జారీ చేశారన్నారు. కొన్నిచోట్ల పింఛన్‌దారులు ఇతర గ్రామాలకు వెళ్లలేకపోయినా, మిగిలిపోయిన వారికి రెండో తేదీ పంపిణీ చేసే అవకాశమున్నా నోటీసులివ్వడం ఎంతవరకు సబబు అని అన్నారు.

మోడీని నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే..

- కేంద్రం చేతుల్లో కీలుబొమ్మలుగా రాష్ట్ర పాలకులు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి -బాపట్ల

మోడీని నమ్ముకుంటే నట్టేట మునిగినట్లేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. బాపట్ల ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ ప్రాంగణంలో సిపిఎం బాపట్ల జిల్లా మొదటి మహాసభ శనివారం ప్రారంభమైంది. మహాసభ సందర్భంగా నగరంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. సభలో బాబూరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మోడీ చేతుల్లో బొమ్మలా మారిందన్నారు. సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రజలను మద్యం మత్తులో ముంచేస్తుందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించమంటే.. మద్యం ధరలు తగ్గించామని నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని బోర్డులు పెట్టే ప్రభుత్వం.. మద్యం అమ్మి ప్రభుత్వం నడపరాదని ఎందుకు ప్రచారం చేయదని ప్రశ్నించారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో భారాలు మోపారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా ఇంత వరకూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇవ్వకుండా అప్పుగా ఇస్తే టిడిపి కూటమి ప్రభుత్వం మౌనంగా



బాపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ.. దేశంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపుతోందన్నారు. త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై దాడులు, హత్యలు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సభకు అధ్యక్షవర్గంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.ఆంజనేయులు, సిపిఎం నాయకులు ఝాన్సీ వ్యవహరించగా సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కార్యదర్శివర్గ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకుడు నూతలపాటి కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, సిహెచ్.మజుందార్, జిల్లా మహాసభ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది జెడ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆరువేల కోట్లు పెరిగిన బడ్జెట్

- రూ. 3.04 లక్షల కోట్లకు చేరిక
- ద్రవ్య వినిమయ బిల్లులో మార్పులు చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ సైజ్ పెరిగింది. నవంబర్ 11న అసెంబ్లీలో రూ.2,94,427 కోట్లకు బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించగా, దానిని ఆమోదించే ద్రవ్య వినిమయ బిల్లులో ఆ మొత్తాన్ని రూ.3,04,020 కోట్లకు సవరించారు. శాసనసభలో బడ్జెట్ డిమాండ్లపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు చేసిన సవరణ డిమాండ్లను ఆమోదించడంతో ఈ పెంపు చోటుచేసుకుంది. వరుసగా రెండుసార్లు ఓట్ ఆన్ అక్కౌంట్‌తో బడ్జెట్‌ను ఆమోదించుకున్న తరువాత తొలిసారి నవంబర్ 11వ తేదీన పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిలో కొద్దిగా అంకెల మార్పులు తప్ప ఏమీ లేదన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ద్రవ్య వినిమయ బిల్లులో పెద్ద ఎత్తున సవరణలు చేయడం గమనార్హం. ఈ సవరణలో ద్రవ్య వినియోగం, ప్రణాళిక, సర్వేల కోసం తొలుత రూ.34,973 కోట్లను ప్రవేశపెట్టగా, తాజా అప్రాప్రియేషన్ బిల్లులో ఈ మొత్తాన్ని ఏకంగా రూ.64 వేల కోట్లకు పెంచేశారు. సాధారణంగా ఈ మొత్తం వ్యయానికి పెద్దగా లెక్కలు ఉండవని, అత్యవసర సమయంలో ఏ శాఖకైనా చెల్లింపులు చేసే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ విభాగానికి భారీ నిధులను కేటాయించినట్లు చెబుతున్నారు. ఇలా ఒకే విభాగానికి భారీగా నిధులు పెంచడంతో ఇతర రంగాలపై కోతలు విధించాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు కనిపిస్తోంది.

కీలక శాఖలకు కుదింపులు

ద్రవ్య వినిమయ బిల్లులో అనేక కీలక శాఖల నిధులకు కత్తెర వేశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, నీటిపారుదల, వ్యవసాయం, విద్యుత్ వంటి రంగాలకు నిధులు తగ్గాయి. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో మౌలిక వసతులు మరింతగా మెరుగుపరుస్తామని చెబుతుండగా, ఆ శాఖకు దాదాపు ఐదు వేల కోట్ల వరకు నిధులు తగ్గడం గమనార్హం. అనునిత్యం ప్రజల ఆరోగ్యంపై విమర్శలు వచ్చే ఆరోగ్య శాఖకు నిధులను తగ్గించారు. సాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తూ పథకాలను అమలు చేయాల్సిన తరుణంలో ఆ శాఖకు కూడా కత్తిరింపులు తగ్గలేదు.

కొన్ని కీలక శాఖల్లో నిధుల కేటాయింపుల్లో మార్పులు (రూ కోట్లలో)

శాఖ	బడ్జెట్‌లో	సవరణ
ఆర్థిక, ప్రణాళిక	34,973	64,000
ఆరోగ్యశాఖ	18,421	16,323
మున్సిపల్, పట్టణాభివృద్ధి	11,478	6,943
నీటిపారుదల	15,513	13,400
విద్యుత్	8,217	7,605
నైపుణ్యాభివృద్ధి	1,217	1,120
పాఠశాల విద్య	29,909	27,873
ఉన్నత విద్య	2,326	2,091
వ్యవసాయం	9,713	9,653

పాఠశాల పండగను జయప్రదం చేయండి

- మాజీ మంత్రి పీతల సుజాత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి పీతల సుజాత పిలుపునిచ్చారు. ఈ నెల 7న పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వీకారం చుట్టనున్నారని తెలిపారు. టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సత్సంబంధాలు ఏర్పడటమే కాకుండా విద్యార్థుల్లో నెలకొన్న భయాలు తొలగిపోతాయని అన్నారు. ప్రభుత్వం త్వరలో మెగా డిఎస్‌సి నిర్వహించబోతుందని తెలిపారు.

గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి ఆనం

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.



సుబ్బారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి ఇకలేరు

- ఎన్నారై ఆస్పత్రికి భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)



గాదె సుబ్బారెడ్డి (ఫైల్)

గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణం ఉండవల్లికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి (78) శనివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. కృష్ణానదిలో ఈతకు వెళ్లిన ఆయన నదిలో ఉండగానే గుండెపోటుకు గురయ్యారు. సహచరులు గమనించి మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు పరీక్షించిన వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య శివలీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాటక రచయిత, దర్శకుడు, నటుడు సుబ్బారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, డి.రమాదేవి, ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఇతర నాయకులు, ప్రజానాట్య మండలి కళాకారులు, నాయకులు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయంపై ప్రజానాట్య మండలి జెండాను కప్పారు. ఆయన భౌతికకాయాన్ని వైద్య పరిశోధనల కోసం మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రికి అప్పగించారు. కళ్లను హైదరాబాద్ ఎల్‌విఆర్ కంటి ఆస్పత్రికి అందించారు. సాయంత్రం నిర్వహించిన సంతాప సభకు ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ అధ్యక్షతన వహించగా పి.మధు, వై.వెంకటేశ్వరరావు, ఎంవివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ తదితరులు మాట్లాడారు. సుబ్బారెడ్డి.. విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో చదివేటప్పుడు ఎస్ఎఫ్ఐలో పని చేశారు. అనంతరం అనేక ఆటుపోట్లను, పెత్తందార్ల దాడులను ఎదుర్కొని ఉద్యమంలో కొనసాగారు. 1980 ప్రాంతాల్లో కృష్ణాజిల్లా ఉయ్యూరు, చల్లపల్లి, దివి డివిజన్‌లో సిపిఎం కార్యదర్శిగా పనిచేశారు. జాషువా సాంస్కృతిక వేదిక ప్రారంభ కన్వీనర్‌గానూ విజయవాడ కేంద్రంగా పనిచేశారు. మహాకవి శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాలు, సుందరయ్య కళాజాతా, వేమన విజ్ఞాన జాతా, సారా వ్యతిరేక ఉద్యమం, అక్షర కళాయాత్రలు ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. ప్రజానాట్య మండలిలో 40 ఏళ్ల ప్రయాణంలో 200 మంది కళాకారులను సిపిఎం సభ్యులుగా తీర్చిదిద్దారు. యువజన సంఘాల్లోనూ పని చేశారు. సుబ్బారెడ్డి మృతికి ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై. కేశవరావు సంతాపం తెలిపారు. రైతు సంఘంలో 15 ఏళ్లు ఉన్నారని, రాష్ట్ర కమిటీలో సభ్యులుగా పనిచేశారని వారు గుర్తు చేశారు. సుబ్బారెడ్డి మృతికి సాహితీస్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి,యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అండ్రమాల్యాద్రి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.



శ్రీలంకలోని పుట్టాలంలో వరదనీటిలో పాక్షికంగా మునిగిన ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

తీరం దాటిన తుపాన్

మొదటిపేజి తరువాయి

ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లా కోడూరు, తుమ్మలపెంట తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సోమశిల ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమానంగానే ఉన్నాయని, ప్రవాహం పెరిగితే నీటి విడుదలకు నిర్ణయం తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫ్లాష్ ఫ్లడ్స్ హెచ్చరిక జారీ అయిన పెన్నా పరివాహక ప్రాంతంలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. సోమశిల ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో ఆత్మకూరు, కావలి, నెల్లూరు ఆర్‌డిఒలు సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్షం కారణంగా జిల్లాలోని పలు గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న పంట నేలకొరిగిపోగా, వర్షపు నీరు చేరి తడిసిపోయింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షానికి తోడు ఈదురుగాలులు వీస్తున్నాయి. తీర గ్రామాలైన ఎస్.యానాం, వాసాలతిప్ప, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేటలో మత్స్యకారులు ఇళ్లకే పరిమితం అయ్యారు. గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలొద్దు

మొదటిపేజి తరువాయి

రూ.16వేల కోట్ల భారాన్ని కేవలం రెండు నెలల్లోనే మోపి, పదేళ్లల్లో లక్షకోట్లు వసూలు చేసుకునే సామర్థ్యం ఉందని నిరూపించారని చెప్పారు. దీనిని ఇలానే సహించాలా? ప్రతిఘటించాలా? అనేది ప్రజలు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. తొందరపాటు నిర్ణయాలతో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. దీనిని ఇలానే ప్రదర్శిస్తే అతి తొందరగానే టిడిపి కూటమి అభాసు పాలవుంతున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రూ.9,412 భారం మోపడానికి ఎపిఇఆర్‌సికి అంత తొందర ఏమిటని ప్రశ్నించారు. ఇంత తక్కువ కాలంలో రూ.16వేల కోట్ల భారం మోపడం ఉమ్మడి రాష్ట్రంలో కూడా జరగలేదన్నారు. జనవరి నుంచి యూనిట్‌కు రూ.2.19లు అదనంగా ప్రజలపై పడనుందని చెప్పారు. ఈ భారాలను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. రాబోయే రోజుల్లో మరింత పెద్దఎత్తున పోరాటానికి సిద్ధపడాలని తెలిపారు. జగన్-అదాని భేటీ రహస్య ఒప్పందం వివరాలను బయట పెట్టాలని తాము కూడా డిమాండ్ చేశామని తెలిపారు. సెకి ఒప్పందంపై గతంలో తమతో పాటు ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ కోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు. ఈ ఒప్పందంపై సిఎం చంద్రబాబుకు పరిశీలన చేయాల్సిన అవసరం లేదని పయ్యావుల కేశవ్ వద్ద సమాచారం మొత్తం ఉందన్నారు. అదానికి భయపడి చర్యలు తీసుకునే ధైర్యం లేక చంద్రబాబు వివరాలు కావాలని కాలయాపన చేస్తున్నారని తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తానంటున్న జగన్ దమ్ముంటే తమపై వేయాలని సవాల్ విసిరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పవర్ వల్ల తాను అధికారం కోల్పోయినట్లు ఇటీవల చంద్రబాబు మాట్లాడారని అన్నారు. ఆ అనుభవాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఐదు నెలల్లోనే రూ.16వేల కోట్ల భారం మోపారని తెలిపారు. అదాని, కేంద్రంలో ఉన్న బిజెపి, వైసిపి, టిడిపి ప్రభుత్వ విధానాల వల్ల అదనపు భారం ప్రజలపై పడనుందన్నారు. త్వరలో ప్రజల ఇళ్లలోకి అదాని మీటర్లు, కరెంట్ వస్తుందని, కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాటం చేయాలంటే వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎంసిపిఐ(యు) నాయకులు సలీం మాట్లాడుతూ నరేంద్రమోడీ అడుగుజాడల్లో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో భారాల ప్రభుత్వంగా మారిందన్నారు. సిపిఎం విజయవాడ పశ్చిమ నగర కార్యదర్శి కృష్ణ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం నాయకులు ఎం హరిబాబు, విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక నాయకులు ఎంవి ఆంజనేయులు బెఫి రాష్ట్ర నాయకులు అజయకుమార్, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు బోస్, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజాశక్తి సిజిఎం వై అచ్యుతరావు, డివైఎఫ్ఐ కార్యదర్శి జి రామన్న, ఎఐవైఎఫ్ నాయకులు లెనిన్, ఆవాజ్ రాష్ట్ర కార్యదిర్శ చిష్టీ తదితరులు పాల్గొన్నారు.

రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాగార్జున యూనివర్సిటీ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య కేసులో నిందితులకు శిక్ష లేకుండా కోర్టు కొట్టివేయడం విచారకరమని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కేసులో ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడంతోపాటు రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలన్నారు. రిషితేశ్వరి ఎదుర్కొన్న వేధింపులను స్పష్టంగా తన డైరీలో రాసుకుందన్నారు. హాయ్‌ల్యాండ్‌లో జరిగిన ఫంక్షన్‌లో ప్రొఫెసరు నుంచి ఎదురైన వేధింపుల గురించి డైరీలో పేర్కొందన్నారు. ఆ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా కోర్టు తీర్పు చెప్పడం శోచనీయమని, వేధింపులకు గురవుతున్న ఆడపిల్లలకు, తల్లిదండ్రులకు ఈ తీర్పు భరోసానిచ్చేదిగా లేదన్నారు.

ప్రాసిక్యూషన్ సక్రమంగా వ్యవహరించి ఉంటే నిందితులు తప్పించుకోవడం సాధ్యపడేది కాదన్నారు. సుదీర్ఘకాలం నిందితులను అరెస్టు చేయకుండా ఉండటంతోనే ఆనాడు అనుమానాలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు.

త్వరలో హైకోర్టు బెంచ్ కార్యకలాపాలు

- మంత్రులు ఫరూక్, బిసి జనార్థన్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో త్వరలో రాష్ట్ర హైకోర్టు బెంచ్ ప్రారంభించికార్యకలాపాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి తెలిపారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని వైసిపి ప్రకటించి అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని, ఇప్పుడు వాటిని సరిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానించినట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేశామన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పత్తి రైతుకు ఇ-క్రాప్ చిక్కులు!

- కొనుగోలుకు నిరాకరిస్తున్న అధికారులు
- ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి
- ఎకరాకు రూ.6 వేలు నష్టం



ముచ్చర్లవలస జన్నింగ్ మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు కొసిరెడ్డి సూర్యనారాయణ. దత్తిరాజేరు మండలం పాచలవలసకు చెందిన ఈయన మరడాం రెవెన్యూ పరిధిలో తనకున్న అర ఎకరం భూమిలో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. అంతా వర్షాధార భూమే. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో ఇప్పటి వరకు సుమారు ఐదు క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. వారం రోజుల క్రితం రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస పత్తి జన్నింగ్ మిల్లు (కొనుగోలు కేంద్రం)కు తీసుకెళ్లారు. 'మీరు పత్తి సాగు చేసినట్టు ఇ-క్రాప్ నమోదు కాలేదు. కొనుగోలు చేయడం కదరదు' అంటూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), మార్కెటింగ్ శాఖ సిబ్బంది తేల్చి చెప్పారు. దీంతో, ఆయన తీసుకెళ్లిన వాహనంలోనే పత్తిని తిరిగి వెనక్కి తీసుకెళ్లారు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు గవిరెడ్డి సత్యనారాయణ. బాడంగి మండలం పిన్నవలసకు చెందిన ఈయన ఈ ఏడాది 1.50 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఇప్పటి వరకు సుమారు 4.30 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. దీన్ని తీసుకుని ముచ్చర్లవలసలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. ఇ-క్రాప్ పోర్టర్‌లో పరిశీలించిన అక్కడి ప్రభుత్వ అధికారులు 'మీరు పత్తి సాగు చేసినట్టు ఇ-క్రాప్ నమోదు అయినప్పటికీ ప్రస్తుతం 2.30 క్వింటాళ్లు విక్రయానికి మాత్రమే అనుమతి ఉంది. మిగిలిన పత్తి డిసెంబర్‌లో విక్రయించుకోవాలి' అని చెప్పారు. దీంతో, ఎలిజిబిలిటీ ప్రకారం 2.30 క్వింటాళ్లు రూ.7 వేల చొప్పున, మిగిలిన రెండు క్వింటాళ్ల పత్తిని అదే మిల్లు ఆవరణలో ఉన్న ఓ ప్రైవేటు ఏజెంటుకు రూ.6,300 లెక్కన తెగనమ్ముకోవాల్సి వచ్చింది.

వీరితోపాటు పాచలవలసలోని సుంకరి మధుసూధనరావు, పిన్నవలసలోని క్రరి ఆంజనేయులు సహా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో వేలాది మంది పత్తి రైతులు ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇ-క్రాప్‌లో నమోదు చేయకపోవడం, ని'బంధనాలు, కొర్రీల వల్ల ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వారు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు తక్కువకు కొంటున్నారు. దీంతో, ఎకరా ఒక్కంటికీ ఆరు వేల రూపాయలకుపైగా రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

ఒకే ఒక్క కొనుగోలు కేంద్రం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఒక్క కొనుగోలు కేంద్రం మాత్రమే ఏర్పాటు చేశారు. ఇది కూడా రామభద్రపురంలోని ఓ ప్రైవేటు మిల్లులో. జిల్లాలోని శివారు ప్రాంతాల నుంచి ఇక్కడికి పత్తి తీసుకురావడానికి వ్యయప్రయాసకు గురికావాల్సి వస్తోంది. అటు భామిని, ఇటు వేపాడ నుంచి ఇక్కడికి పత్తిని తీసుకురావడానికి ఎక్కువ సమయం పడుతోంది. వేల రూపాయలు రవాణా ఛార్జీలు భరించాల్సి వస్తోంది. తీరా అక్కడికి వెళ్లాక కొనుగోలు చేస్తారనే గ్యారటీ ఉండకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. పత్తి సాగు విస్తీర్ణం ఇ-క్రాప్‌లో నమోదు మొదలుకుని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడమే ఇందుకు కారణమని రైతులు, రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

కొన్నది 1,140 క్వింటాళ్లే

అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం జిల్లాలో మొత్తం 4,685 మంది రైతులు 4,137 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరాకు తక్కువలో తక్కువ ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చిందనుకున్నా సుమారు 23,425 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్టు లెక్క. ఇప్పటి వరకు 138 మంది రైతుల నుంచి 1,140 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసినట్టు మార్కెటింగ్ శాఖ ఎడి లెక్కలు చూపిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.

కేంద్రం దృష్టికి టెక్స్‌టైల్స్ పరిశ్రమల సమస్యలు

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)



కేంద్ర మంత్రికి సమస్యలు వివరిస్తున్న టెక్స్‌టైల్స్ పరిశ్రమల యజమానులు

పరిశ్రమలు ఇబ్బందుల్లో ఉన్నాయని, ముఖ్యంగా టెక్స్‌టైల్స్ పరిశ్రమలు చాలా సమస్యల్లో ఉన్నాయని, వాటిని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తామనని కేంద్ర గ్రామీణాభివృద్ధి, టెలికమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాలవారిపాలెం టెక్స్‌టైల్ పార్కును నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులతో కలిసి మంత్రి శనివారం ఆయన సందర్శించారు. పరిశ్రమల యజమానులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుల్లారావు పలు సమస్యలను ప్రస్తావించారు. జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు సహా పత్తి ఆధారిత పరిశ్రమలన్నీ మూతపడుతున్నాయని, దేశంలో సగం మిల్లులు ఇప్పటికే మూతపడ్డాయని, మిగతావి నష్టాల్లో ఉన్నాయని చెప్పారు. పత్తికి మద్దతు ధరను కేంద్రం కొంత పెంచినా రైతులు కష్టాలు తీరడం లేదన్నారు. పైర్లకు తెగుళు సోకి, దిగుబడి తగ్గుతోందని తెలిపారు. ఈ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని, సంక్షోభంలో ఉన్న కాటన్ పరిశ్రమలను ఆదుకునేందుకు కృషి చేస్తామని మంత్రి చంద్రశేఖర్ హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం (విజయనగరం జిల్లా)

విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని కొండపాలవలస గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాడంగి మండలం గజరాయుని వలస గ్రామానికి చెందిన నల్ల అప్పలనాయుడు (58), తన భార్య సరోజినితో కలిసి కొండపాలవలస పరిధిలో ఉన్న తమ పొలంలో పురుగుల మందు చల్లేందుకు వెళ్లారు. మందు చల్లడం పూర్తయ్యాక అప్పలనాయుడు చేతులు శుభ్రం చేసుకోవడానికి బోరు మోటారు స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అప్పలనాయుడు అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఆయన భార్య వెళ్లి చూడగా అప్పటికే అప్పలనాయుడు మరణించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, అందులో ఒకరికి వివాహమైంది. సరోజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రామభద్రపురం ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.



మీగడ రామలింగస్వామికి గురజాడ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎన్‌వి రమణ

'మీగడ'కు గురజాడ విశిష్ట పురస్కారం

- ప్రదానం చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు విశిష్ట పురస్కారాన్ని నంది అవార్డు గ్రహీత, రచయిత మీగడ రామలింగస్వామికి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ ప్రదానం చేశారు. గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సందర్భంగా శనివారం విజయనగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత గురజాడ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో రామలింగస్వామికి గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఎన్‌వి రమణ అందజేశారు. సువర్ణ అక్షర గండ పిండేరం బిరుదును ప్రదానం చేశారు. అనంతరం ఎన్‌వి రమణ మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా ప్రశ్నించిన ఎన్నో సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయన్నారు. గురజాడను ఆదర్శంగా తీసుకొని వాడుక భాషను అభివృద్ధి చేయాలని కోరారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిందని, దీంతో మాతృభాషకు, తెలుగు ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని తెలిపారు. దీనిపై హైకోర్టులో కేసును కొట్టివేయడంతో గత ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లిందని, ఆ కేసు ఇంకా పెండింగ్‌లో ఉందని చెప్పారు. తెలుగు భాషకు గౌరవం దక్కాలంటే గత సర్కారు పెట్టిన కేసును ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీని, మాండలికాలకు అనుగుణంగా అమరావతిలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కవితా పోటీల్లో విజేతలకు ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గురజాడ వారసులు వెంకట అప్పారావు, ఇందిరా, కుటుంబ సభ్యులు, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, గురజాడ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి- తిరుమల :

తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టిటిడి నిర్ణయించింది. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే రాజకీయ నాయకులలో కొంతమంది దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం ఇటీవల పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోందని, ఈ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టిటిడి బోర్డు ఇటీవల తీర్మానించింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతీసే ప్రసంగాలకు దూరంగా ఉండి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

అదానీ సంస్థతో ఒప్పందాలన్నీ అక్రమమే

- సదస్సులో అజశర్మ, గంగారావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)



సదస్సులో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

రాష్ట్రంలో గౌతం అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలన్నీ రాష్ట్ర రాజకీయ పార్టీలకు ముడుపులు చెల్లించి చేసుకున్న అక్రమ ఒప్పందాలేనని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. 'అదానీ ముడుపులు - విద్యుత్ ఒప్పందాలు - ఆంధ్ర రాష్ట్ర రాజకీయ పార్టీల పాత్ర' అనే అంశంపై సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం సదస్సు జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అజశర్మ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో గత ప్రభుత్వ పెద్దలకు అదానీ రూ.2029 కోట్లు ముడుపులు చెల్లించినట్లు అమెరికా న్యాయవ్యవస్థ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు నవంబరు 20న బయపెట్టారన్నారు. నేటికి 10 రోజులు గడిచినా ముడుపులు చెల్లించిన అదానీపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక భారతదేశ సంపదను, వనరులను అదానీకి దోచిపెట్టారన్నారు. విద్యుత్, రైల్వే, ఎయిర్ ఇండియా, పోర్టులు, రోడ్లు, బొగ్గు, ఇనుప ఖనిజం తదితరాలను అదానీపరం చేయడంతో ప్రపంచంలోనే కుబేరుల జాబితాలోకి వెళ్లారని గుర్తు చేశారు. సోలార్ విద్యుత్‌పై సెకీ ద్వారా ఒప్పందం చేసుకొని అదానీ సంస్థ నుంచి అధిక ధరకు కొనుగోలు చేసుకునే విధంగా ఈ ఒప్పందం ఉండటంతో వినియోగదారులపై పెను భారం పడుతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు పంపిణీ బాధ్యత కూడా అదానీ సంస్థకే కట్టబెట్టడం వెనుక భారీ ముడుపులు ముట్టాయని తెలిపారు.

డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, రాష్ట్ర సంపదను అదానీ పరంచేయడంలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షపార్టీలు పోటీ పడ్డాయన్నారు. సోలార్ విద్యుత్‌కు రాష్ట్రంలో గత ప్రభుత్వం అల్లూరి జిల్లాలోని భూములను అదానీకి కట్టబెట్టిందని తెలిపారు. విద్యుత్ ఒప్పందాల్లో రూ.1750 కోట్లు ముడుపులు తీసుకున్నట్లుగా అమెరికా న్యాయవ్యవస్థ వెల్లడించిందన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రయివేట్ సంస్థల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసుకునే విధంగా చర్యలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టులను అదానీకి కట్టబెట్టారన్నారు. సాగరతీరంలో స్యాండ్ మైనింగ్, కాపులుప్పాడ డేటా సెంటర్, అప్పికొండ వద్ద డీశానిటేషన్ ప్లాంట్ తదితరాలను అదానీకి అప్పగించారన్నారు. ఈ ఒప్పందాలన్నింటిలోనూ వైసిపి, టిడిపి, జనసేన పార్టీల పాత్ర కీలకంగా ఉందన్నారు. అదానీకి రాష్ట్ర సంపదను దోచిపెడుతున్నా జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరుమెదపటం లేదన్నారు. విశాఖకు, ఆంధ్రరాష్ట్రానికి తీవ్ర నష్టం చేసే అదానీ గ్రూపుతో చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దుచేయాలని, గంగవరం పోర్టును స్టీల్‌ప్లాంట్‌కు అప్పగించాలని, డేటా సెంటర్, సాండ్‌మైనింగ్‌ను, సౌర విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీల చెలగాటం

- వైద్య బీమా క్లెయిమ్ 80 శాతం లోపే చెల్లింపు
- 18 శాతం కేసుల నిరాకరణ
- ప్రభుత్వ సంస్థలు భేష్



న్యూఢిల్లీ : దేశంలోని ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు పాలసీదారులతో చెలగాటం ఆడుతోన్నాయి. బీమా ఇచ్చే సమయంలో క్యాష్‌లెస్, మొత్తం మేమే భరిస్తామని చెప్పుతూ పాలసీలు చేపిస్తున్నాయి. ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో పాలసీదారు అనారోగ్యంతో హాస్పిటల్ పాలు అయితే చెల్లింపుల్లో కొసర్లు, కోతలు పెడుతున్నాయి. మొత్తం బిల్లింగ్‌లో 80 శాతం లోపే భరిస్తున్నాయి. మిగితా మొత్తం భారం పాలసీదారులపై పడేస్తున్నాయి. దేశంలోని 20 ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు 2023లో 80 శాతం లోపే క్లయిమ్ మొత్తం చెల్లింపులు చేశాయి. అంటే హాస్పిటల్‌లో రూ.1 లక్ష బిల్లు అయితే కేవలం రూ.80వేలు మాత్రమే చెల్లించాయి. మిగితా రూ.20వేలు పాలసీదారు చెల్లించాల్సి వచ్చింది. వైద్య బీమా చెల్లింపులు, పరిష్కారాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరును కనబర్చాయి. గరిష్టంగా 98 శాతం మేర చెల్లింపులు చేసిన సంస్థలు ఉన్నాయి. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబిఎఐ) రిపోర్ట్ ప్రకారం.. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ మాత్రం ఏకంగా 98.74 శాతం మొత్తం చెల్లిస్తూ టాప్‌లో ఉండటం విశేషం. మరో పిఎస్‌యు ఓరియంటల్ ఇన్సూరెన్స్ కూడా సగటున 97.35 శాతం మొత్తాన్ని చెల్లించింది. ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో సగటున 71.35 శాతం మొత్తం క్లెయిమ్ చెల్లింపులు చేసింది. ఐసిఐసిఐ లంబార్డ్ 63.98 శాతం చెల్లించగా.. ఈ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టార్ హెల్త్ మాత్రం 54.61 శాతం క్లెయిమ్ చెల్లింపులు చేయడం గమనార్హం. ఆరోగ్య బీమా వ్యాపారంలోని 29 బీమా సంస్థలలో కేవలం నాలుగు బీమా కంపెనీలు మాత్రమే 2023 సంవత్సరంలో 90 శాతం కంటే ఎక్కువ క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తిని (క్లెయిమ్‌ల సంఖ్యపై) కలిగి ఉన్నాయి. దాదాపు పది బీమా సంస్థలు 80 శాతం కంటే తక్కువ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను కలిగి ఉన్నాయి.

ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తిలో 95.04 శాతంతో ముందంజలో ఉంది. ఆదిత్య బిర్లా హెల్త్ 94.52 శాతం, ఇఫ్కో టోకియో 91.70 శాతం, బజాజ్ అలియాంజ్ 90.29 శాతంతో క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తులతో ముందు వరుసలో ఉన్నాయి. ప్రయివేటు బీమా కంపెనీలు క్లెయిమ్ చెల్లింపుల్లో 5-18 శాతం వరకు నిరాకరిస్తున్నాయి. 2022-23లో సాధారణ, ఆరోగ్య బీమా సంస్థలు 2.36 కోట్ల ఆరోగ్య బీమా క్లెయిమ్‌లను పరిష్కరించాయి. ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి రూ.70,930 కోట్లు చెల్లించాయి. ఒక్కో క్లెయిమ్‌కు చెల్లించిన సగటు మొత్తం రూ.30,087గా ఉంది. స్థూలంగా 75 శాతం క్లెయిమ్‌లు మాత్రమే పరిష్కరించబడ్డాయి. అంటే మరో 25 శాతం క్లెయిమ్‌లు నిరాకరణకు గురైయ్యాయి. మొత్తం క్లెయిమ్‌లలో 56 శాతం నగదు రహిత విధానంలో, మరో 42 శాతం రీయింబర్స్‌మెంట్ విధానంలో పరిష్కరించబడ్డాయి. గడిచిన 2023-24కు సంబంధించి బీమా క్లెయిమ్ రిపోర్ట్ విడుదల కావాల్సి ఉంది.

అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు 'భర్తీ'తో ఎంఒయు

- పిసిసిఎఫ్ చిరంజీవి చౌదరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అరుదైన అటవీ ఉత్పత్తుల గుర్తింపుతోపాటు, కార్పొరేట్ స్థాయి మార్కెటింగ్‌తో గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగుపడనున్నాయని పిసిసిఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఎపి అటవీశాఖ, ఎపి అటవీ అభివృద్ధి సంస్థ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన భర్తీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 40 శాతం మంది గిరిజనులు అటవీ ఉత్పత్తులపై ఆధారపడి నేటికీ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి ఈ ఒప్పందం వల్ల ఎంతో మేలు జరుగుతుందని, అటవీ ఉత్పత్తులతో సంపద సృష్టి పెరగనుందన్నారు. అటవీ ఉత్పత్తుల ఆదాయం దానిని నమ్ముకుని జీవించే గిరిజనులకే దక్కేలా చూడటమే ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. ప్రాజెక్టులో భాగంగా అటవీ ఉత్పత్తుల గుర్తింపు, మార్కెటింగ్ సప్లై చైన్ ఏర్పాటు, కొత్త అవకాశాలను సృష్టించడం అనేది ప్రధానమైన అంశాలుగా ఉన్నాయని చెప్పారు. ఒప్పందం ప్రకారం అడవుల్లో దొరికే సహజ సిద్ధమైన ఉత్పత్తులను గుర్తించడం, సేకరించడం, అమ్మకాలపై దృష్టిసారిస్తారన్నారు. పర్యావరణ హితంగా అడవుల సాధారణ స్థితికి ఏ మాత్రం భంగం కలిగించకుండా డిజిటల్, నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అరుదుగా లభించే ఉత్పత్తులను గుర్తిస్తారని తెలిపారు.

మీడియా సంస్థలకు జగన్ లీగల్ నోటీసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సెకీ, ఎపి ప్రభుత్వానికి మధ్య జరిగిన విద్యుత్ ఒప్పందాలపై తప్పుడు కథనాలు ప్రచురించాయంటూ రెండు మీడియా సంస్థలకు మాజీ సిఎం వైఎస్ జగన్ లీగల్ నోటీసు జారీ చేశారు. తప్పుడు కథనాలు ప్రచురించినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నోటీసులో పేర్కొన్న జగన్, దాన్ని మొదటిపేజీలో ప్రచురించాలని కోరారు. ఎపి ప్రభుత్వం, సెకీ మధ్య ఒప్పందమంతా పారదర్శకంగా జరిగిందన్న వివరాలు, ఆధారాలను లీగల్ నోటీసులో జత చేసిన ఆయన ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలు ప్రచురించారని పేర్కొన్నారు. దీనివల్ల తన ప్రతిష్ట దెబ్బతిందన్నారు.

మంత్రిగా ఐదేళ్లు ఏం చేశారు

- మాజీ మంత్రి రోజాను ప్రశ్నించిన పిసిసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ విద్యుత్ ధరలు గణనీయంగా తగ్గుతుంటే 25 ఏళ్లకు ఒప్పందం ఎందకు కుదుర్చుకున్నారని మాజీ మంత్రి రోజాను పిసిసి ప్రశ్నించింది. పిసిసి చీఫ్ షర్మిలపై రోజా 'ఎక్స్'లో చేసిన వ్యాఖ్యలకు పిసిసి శనివారం కౌంటర్ ఇచ్చింది. ఇవి తమ రాతలా లేక సకల శాఖల మాజీ మంత్రి రాసిందా? లేక సాక్షి పంపిన స్క్రిప్టా? అంటూ ప్రశ్నించింది. అదాని నుంచి యూనిట్ రూ.2.49కి కొన్నా వీలింగ్ చార్జీలు, జిఎస్‌టి కలిసి రూ.4.16కి చేరుతుందని వెల్లడించింది. చంద్రబాబు హయాంలో ఇంకా ఎక్కువకు సోలార్ విద్యుత్ కొన్నారని ఇప్పుడు గుర్తుకు వచ్చిందా, ఐదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశించింది.

నాలుగు శాతం తగ్గిన చమురు ధర

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మరింత దిగివచ్చాయి. గడిచిన ఐదు రోజుల్లోనే ఏకంగా 4 శాతం తగ్గి శనివారం బ్యారెల్ ధర 73 డాలర్లుగా నమోదయ్యింది. ఇజ్రాయిల్, హెజ్బుల్లా వివాదం నెమ్మదించడం, సరఫరా ప్రమాదాలపై ఆందోళన తగ్గడం, 2025 సరఫరాను పెంచనున్నట్లు పెట్రోలియం ఎగుమతుల ఆర్గనైజేషన్ ఒపెక్ సంకేతాలు చమురు ధర తగ్గడానికి కారణమని నిపుణులు భావిస్తున్నారు. వారాంతం రోజున చమురు ధర 34 సెంట్లు లేదా 0.46 శాతం తగ్గి 72.94 వద్ద ముగిసింది. వారంలో 3.1 శాతం తగ్గగా.. ఐదు రోజుల్లో 4.8 శాతం దిగివచ్చింది.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు..

- ప్రయివేటు నర్సింగ్ కళాశాల బస్సు దగ్ధం
- డ్రైవర్ అప్రమత్తంతో విద్యార్థినులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చెరుకుపల్లి (బాపట్ల జిల్లా)

షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ ప్రయివేటు విద్యా సంస్థకు చెందిన బస్సు దగ్ధమైంది. బస్సు డ్రైవర్ అప్రమత్తం కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన బాపట్ల జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన ఐఆర్ఇఎఫ్ నర్సింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు పరీక్ష రాసేందుకు గుంటూరు జిజిహెచ్‌కి బస్సులో వెళ్తున్నారు. బస్సు గూడవల్లి గ్రామం వద్దకు రాగానే ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. వెంటనే విద్యార్థులను బస్సు నుంచి కిందికి దిపారు. ఆ సమయంలో బస్సులో 30 మంది విద్యార్థినులు ఉన్నారు. బస్సు డ్రైవర్ చాక్యచక్యంగా వ్యవహరించడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. రేపల్లె అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది.

అదానీతో సంబంధం లేదని జగన్ చెప్పడం హాస్యాస్పదం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అదానీతో విద్యుత్ ఒప్పందం కుదిరిన సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... అదానీతో తనకు సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం సంఘటనా పర్వ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అదానీతో ఒప్పందాలు చేసుకున్న సమయంలో ప్రస్తుతం పాలకపక్షంలో ఉన్న ప్రభుత్వాలు ఆనాడు విపక్షంలో ఉన్నాయన్నారు. విద్యుత్ ఒప్పందాలకు, బిజెపికి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. ఈ వర్క్‌షాప్‌కు బిజెపి జాతీయ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె లక్ష్మణ్, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, బిజెపి రాష్ట్ర రిటర్నింగ్ అధికారి వెంకట సత్యనారాయణ హాజరయ్యారు.

నవంబర్‌లో రూపాయి అత్యంత పేలవం

- 0.5 శాతం క్షీణత



న్యూఢిల్లీ : తమ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రూపాయి విలువను అమాంతం పెంచుతామని.. డాలర్‌కు సమానంగా రూపాయి విలువ చేస్తామని.. రూపాయి కరెన్సీల కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో చేసిన ప్రచార అర్భాటాలకు ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకుండా పోయింది. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో అయితే రూపాయి విలువ అత్యంత పేలవంగా నమోదయ్యింది. ఈ ఒక్క నెలలోనే 0.5 శాతం విలువ కోల్పోయింది. అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత డాలర్ విలువ మరింత పెరగడం, భారత మార్కెట్ల నుంచి భారీగా విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు తరలిపోవడంతో గడిచిన ఎనిమిది నెలల్లో ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి విలువ పడిపోయింది. శుక్రవారం నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.48కు పరిమితమయ్యింది. అక్టోబర్ ముగింపు నాటికి రూపాయి విలువ 82.71గా ఉంది. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు 2014లో డాలర్‌తో రూపాయి విలువ 60లోపే ఉండటం విశేషం.

అవివా ఇండియాకు రూ.90 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో రూ.90 కోట్ల లాభాలు సాధించినట్లు బీమా సంస్థ అవివా ఇండియా తెలిపింది. అదే సమయంలో అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) 13 శాతం పెరిగి రూ.14,636 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. గ్రాస్ రిటెన్ ప్రీమియం (జిడబ్ల్యుపి) రూ.548 కోట్లుగా నమోదయ్యింది. ఈ కాలంలో 98.98 శాతం క్లెయిమ్‌ల చెల్లింపులు చేసినట్లు వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో రూ.63 కోట్ల లాభాలు నమోదు చేసినట్లు పేర్కొంది.

సంపాదకీయం

నిషిద్ధ స్వప్నం

బాల్య వివాహాలు చాలా పాతకాలం నాటి మాట. నేటికీ కొనసాగుతున్న తాజా అనాచారం. ఆడది అవనిలో సగం.. ఆకాశంలో సగం... అని నిరూపించుకుంటున్న ఈ రోజుల్లోనూ బాల్య వివాహాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి 18 ఏళ్ల లోపే వివాహం జరుగుతున్నట్లు 'ది లాన్సెట్ జర్నల్' వెల్లడించింది. అంతేకాదు...కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా చదువులు చతికిలబడ్డాయి. పేదరికం పెరిగిపోయింది. ఫలితంగా వచ్చే దశాబ్ద కాలంలో కోటి మంది బాలికలు...వివాహ చట్రంలో ఇరుక్కుపోనున్నారు. ఏటా 1.2 కోట్ల మంది బాల్యంలోనే వివాహ వ్యవస్థలోకి నెట్టబడతారని లాన్సెట్ చెబుతోంది. బాల్య వివాహాలు ఆడపిల్లల ఆరోగ్యానికి, జీవితానికి ముప్పుగా మారతాయి. ఎదిగీ ఎదగని శరీరం, అవగాహనలేని వయసు, పరిపక్వతలేని మనసు, అమ్మపై ఆధారపడే వయస్సులో అమ్మగా మారడం ఆ చిన్నారి ఎదుగుదలకు ఆటంకం. 'మాకు ఈడు లేదు ఇగురం లేదు ఓ ఎమ్మాలో/ ఇంతలోనే పెళ్లి అంటారా?.. మా ఎమ్మాలో/ సంసారమీద సత్తువ ఉందా?.. ఓ ఎమ్మాలో/ నా బాల్యమంత బందీ జేస్తారా?.. ఓ ఎమ్మాలో/ వద్దే వద్దమ్మ నాకు బాల్య వివాహం బడి ఈడులోనే బండెడంత బాధ్యత భారం' అంటారో కవి. బాల్య వివాహాలు నిరోధించడానికి రాజారామ్ మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం వంటివారు కృషి చేసినా... ఈ మూఢాచారం నేటికీ కొనసాగుతోంది.

తల్లి గర్భం నుంచే సమాజంతో నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి బాలికలది. సాధ్యమైనంత త్వరగా ఆడపిల్లకు పెళ్లి చేసి వదిలించుకోవాలన్న పురుషాధిక్య భావజాలం ఆడపిల్ల అందమైన కలలను, భవితను, జీవితాన్ని చిదిమేస్తోంది. 'బాల్యంలో/ బొమ్మకు అమ్మనయ్యానని సంతోషించాను/ ఇప్పుడు/ అమ్మనూ నేనే, బొమ్మనూ నేనే' అంటారు కవయిత్రి అంజన. చదువు, ఆటపాటలతో ఎదగాల్సిన బాలికలు... చిన్న వయసులో పెళ్లి వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారు. శారీరక, మానసిక పరిపక్వత లేని వయసులో గర్భం ధరించడం వల్ల మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల చిన్నతనం నుంచే వారి హక్కులు ఉల్లంఘించబడుతూ, ఆర్థిక పరాధీనతను పెంచుతున్నాయి. 'బాల్య వివాహాలు బానిసత్వం యొక్క ఒక రూపం. దానిని రద్దు చేయాలి' అంటారు నెల్సన్ మండేలా. బాల్య వివాహాలు సామాజిక దురాచారం. వీటిని అరికట్టడం వలన మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. దేశంలో దాదాపు 300 జిల్లాల్లో జాతీయ సగటుతో పోలిస్తే బాల్య వివాహాల రేటు ఎక్కువగా వుందని తాజాగా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిగా 1929లో బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. ఆ తర్వాత క్రమంగా పరిస్థితి మరింత మెరుగుపడుతూ వచ్చింది. అయినా నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే వున్నాయి.

18 ఏళ్లలోపు బాలికలు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేస్తే, తల్లిదండ్రులతోపాటు వివాహం చేసిన వారికి కూడా రెండేళ్లపాటు జైలుశిక్ష విధిస్తారని చట్టం చెబుతోంది. బాలలకు చట్టంలో సమానత్వం వుందని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం రావాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపున దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు నిరాఘాటంగా జరుగుతున్నాయి. 'ఆడదే ఆధారం/ మన కథ ఆడనే ఆరంభం/ ఆడదే సంతోషం/ మనిషికి ఆడదే సంతాపం' అంటాడో సినీ కవి. మనిషి కథ ఆరంభమైన చోటనే... అంతం కాకూడదు, అది సంతాపంగా మారకూడదు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేది, వారి జీవితాన్ని వెలుగు దివ్వెగా మార్చేది, పురుషాధిక్యతను ప్రశ్నించేది చదువు మాత్రమే. ఇది నిషిద్ధ స్వప్నం కాదు. ఈ పురుషాధిపత్య సంకెళ్లను ఛేదించి, తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే సాధికారయత్నం. 'ఇతిహాసపు చీకటి కోణం/ అట్టడుగున పడి కాన్పించని/కథలన్నీ కావాలిప్పుడు/ దాచేస్తే దాగని సత్యం' అంటారు మహాకవి శ్రీశ్రీ. ఆడబిడ్డను బతకనిద్దాం... ఎదగనిద్దాం... చదవనిద్దాం... ఎగరనిద్దాం.


మంచి మాట




గెలుపు అందరికీ
దొరకదు కానీ...
గెలిచే శక్తి మాత్రం
అందరిలోనూ వుంటుంది.
- సిసిరో

కాంగ్రెస్‌కు 'మహా'పాఠం

కూటమిలో తనకే అత్యధిక స్థానాలలో పోటీ చేయాలని పట్టుపట్టిన కాంగ్రెస్ ప్రచారంలో అంత పదునుగా పాల్గొనలేదు. ఆఖరుకు రాహుల్ గాంధీ కూడా పరిమితంగా తప్ప మీద వేసుకుని ప్రచారం చేసింది లేదు. సంప్రదాయ శివసేన ఓటర్లను ఉద్ధవ్ థాకరే ఆకట్టుకోలేకపోయారు. ఎంవిఎ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందే ఉద్ధవ్‌ను ప్రకటించకపోవడంతో మరాఠా ఆత్మగౌరవ భావన దెబ్బతిన్నదనే ప్రచారం ప్రభావం చూపింది. స్వయంగా ఉద్ధవ్ కూడా ముందే సిఎం పేరు ప్రకటించి వుండాల్సిందని అసంతృప్తి వెలిబుచ్చారు. సిపిఎం, సిపిఐ, ఎస్‌పి వంటి పార్టీలను కలుపుకోవలసిన అవసరాన్ని అసలే గుర్తించలేదు. లోక్‌సభ ఎన్నికలలో సిపిఎంకు సీటే కేటాయించకపోయినా ఓట్ల చీలిక నివారించడం కోసం పోటీ చేయకుండానే మద్దతునిచ్చింది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలలోనూ అనేక విమర్శల తర్వాత మూడు స్థానాలకు అంగీకరించి మళ్లీ ఒకచోట పోటీ పెట్టింది కాంగ్రెస్. దహను, సోలాపూర్, కల్యాన్‌లలో సిపిఎం పోటీ చేస్తుండగా. సేన, ఎన్‌సిపి మూడు చోట్ల మద్దతునిచ్చినా సోలాపూర్‌లో కాంగ్రెస్ పోటీ చేసి బిజెపి గెలవడానికి కారణమైంది. సిపిఎం దహను స్థానంలో పదోసారి విజయం సాధించడం ఒక విశేషం. ఎస్‌పి విషయంలోనూ ఇదే జరిగింది.



తెలకపల్లి రవి



రాజకీయంగా ఆర్థికంగా దేశంలో అత్యంత కీలక పాత్ర వహించే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు బిజెపి, ఎన్‌డిఎలకు అమితానందం కలిగిస్తే కాంగ్రెస్, 'ఇండియా' వేదికకు తీవ్ర నిరుత్సాహానికి గురిచేశాయి. నవంబరు 20న పోలింగ్ ముగిసిన ఈ రాష్ట్రంలో ఫలితాలు 23వ తేదీన వెలువడ్డాయి. సాధారణ అంచనాలు ఎగ్జిట్ పోల్స్ లెక్కలు తారుమారయ్యాయి. బిజెపి, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి చీలిక వర్గాలతో ఏర్పడిన పాలక మహాయుతి కూటమి 288 స్థానాలలో 230 పైగా తెచ్చుకుని ఘన విజయం సాధించింది. బిజెపికి 132, ఏక్‌నాథ్ షిండే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్‌సిపిఎ కి 41 వచ్చాయి. మరోవైపున ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ థాకరే), ఎన్‌సిపి (శరద్ పవార్) లతో కూడిన మహా వికాస్ అగాధీ కూటమి పార్టీలలో ఏ ఒక్కటీ ప్రతిపక్ష హోదా కూడా పొందలేకపోయాయి. నిజానికి సేన, ఎన్‌సిపి మూల సంస్థలు ఎంవిఎలో వున్నా పోటీ నేతలతో చీలిపోయిన వర్గాలే అధిక స్థానాలతో వీళ్లను వెనక్కు నెట్టేశాయి. ఆరు మాసాల కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఎంవిఎ 30 స్థానాలు తెచ్చుకుని సంచలనం సృష్టించింది. మహాయుతి కేవలం 17 స్థానాలకే పరిమితమైంది. అదే సమయంలో రెండు కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 0.4 శాతం మాత్రమే వుండటం వల్ల శాసనసభ ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

లోక్‌సభ ఓటింగులో జాతీయ రాజకీయ కోణాలు ప్రధానంగా పని చేస్తాయి. శాసనసభ ఎన్నికలు రాష్ట్రాలను బట్టి జరుగుతాయి. అక్కడ ఎక్కువ స్థానాలు వచ్చినా అసెంబ్లీ వ్యవహారం భిన్నంగా వుండొచ్చని గతంలో చాలా సార్లు రుజువైంది. అందుకే 'ఇండియా' వేదిక, ప్రత్యేకించి ప్రధాన పాత్ర వహించే కాంగ్రెస్ వాస్తవికత చూపించాలని పరిశీలకులు, భాగస్వామ్య పక్షాలు పదేపదే హెచ్చరిస్తూ వచ్చాయి. హర్యానాలో లోక్‌సభ ఎన్నికలలో సరిసమానంగా సీట్లు తెచ్చుకుని అధికారంలోకి రావడం ఖాయమని హడావుడి చేసిన కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతిన్న అనుభవం పని చేస్తుందని భావించారు. లౌకిక శక్తుల ఐక్యతకు సర్దుబాట్లకు ప్రాధాన్యతనివ్వకపోవడమే హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి కారణమని తేల్చి చెప్పారు. దీనికి అంతర్గత అనైక్యత కూడా తోడై పరాజయం తీవ్రమైంది. మహారాష్ట్రలోనైనా అలాంటివి మార్చుకోకపోగా అంతకంటే ఘోరంగా దెబ్బతినడం వారికే దిగ్భ్రాంతి కలిగించింది. శివసేనపై ఉద్ధవ్ థాకరే పట్టు సడలిందా, ఎన్‌సిపి కౌటిల్యుడు శరద్ పవార్ ప్రభ తగ్గిందా వంటి ప్రశ్నలూ ముందు నిలిచాయి. మరోవైపు అంత విజయం సాధించిన బిజెపి కూటమి కూడా ముఖ్యమంత్రి ఎంపిక పూర్తి చేసుకోలేకపోవడం బట్టి రాజకీయ సవాళ్లు అర్థమవుతాయి. ఇప్పటికే షిండే అలిగి ఊరెళ్లిపోయారు. అయితే ఏదోవిధంగా అవసరమైతే షిండేను తప్పించైనా సరే బిజెపి దేవేంద్ర ఫడ్నవిస్‌కే పదవి కట్టబెడుతుందని అందరికీ తెలుసు. ధృతరాష్ట్ర కౌగిలిలా బిజెపితో మరీ ముఖ్యంగా మోడీతో అంటకాగిన వారు ఆఖరుకు ఏమవుతారో చెప్పే ఉదాహరణ షిండే. అయినా తెలుగునాట కొందరు నేతలు అందుకు ఆరాటపడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది.

రంగంలోకి ఆర్‌ఎస్‌ఎస్...

మహారాష్ట్రలో ఎంవిఎ సీట్ల సర్దుబాటు చర్చల నుంచి నియోజక వర్గాల కేటాయింపు వరకూ అస్తవ్యస్తంగానే జరిగింది. మూడు ప్రధాన పార్టీలే తేల్చుకోలేకపోగా వామపక్షాలు, ఇతర లౌకిక పార్టీలతో సకాలంలో సరైన చర్చలే జరగలేదు. మరోవైపు బిజెపి ఎలాగైనా లోక్‌సభ ఫలితాలను మార్చి అధికారంలోకి రావడమే ఏకైక ధ్యేయంగా వ్యవహరించింది. చివరి మాసాలలో 'లడ్కీ బహెన్ యోజన' వంటి పథకాలను ప్రకటించి రూ.1500 ఆగమేఘాల మీద బదిలీ చేసింది. ఎంవిఎ రూ.3000 ఇస్తామని వాగ్దానం చేసినా అధికారంలో వుండి తక్షణం ఖాతాల్లోకి పంపించారు గనక ఎక్కువ పనిచేసిందని చెబుతున్నారు. దీనికి తోడు కుల, మత ప్రచారాలను మహాయుతి నేతలు దారుణంగా సాగించారు. కలసి వుండాలని చెబుతున్నట్టుగా ఏక్ హైతో సేఫ్ హై (కలిసి వుంటే మనం సురక్షితంగా ఉంటాము), బాటేంగే తో కటేంగే (చీలిపోతే కూల్చేస్తారు) వంటి నినాదాలతో హిందూ మతతత్వ రాజకీయాలను ప్రచారం చేశారు. మోడీ, హోం మంత్రి అమిత్ షా, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల త్రయం తోడు ఆర్‌ఎస్‌ఎస్ నేరుగా రంగంలోకి దిగి ఇంటింటికీ తిరిగి జాతీయత, మతం అంటూ ప్రచారం నడిపించింది. అసలు తమ వల్లనే ఈ విజయం సాధ్యమైందని కూడా వారి వాదనగా వుంది.

ఎంవిఎను తికమక పెట్టేందుకు గాను శరద్ పవార్ బిజెపితో చేతులు కలిపారనే ప్రచారం నడిపించారు. 2019లో బిజెపిని బలపర్చడానికి శరద్ పవార్ ఆదేశాలపైనే బిజెపితో చర్చలు జరిపామనీ, అప్పట్లో అదానీ కూడా ఆ చర్చలలో పాల్గొన్నారని అజిత్ పవార్ వెల్లడించారు. అదానీ ఇంట్లో చర్చలు జరిగాయి గానీ ఆయనతో భోజనం మాత్రమే చేశామనీ చర్చలలో లేరనీ శరద్ పవార్ వివరణ ఇచ్చినా కలసిన సంగతి మాత్రం కొట్టివేయలేదు. అంతేగాక అజిత్ పవార్‌తో ఆయన కుటుంబ సంబంధాలు కూడా లేనిపోని చర్చలయ్యాయి.

కాంగ్రెస్ తప్పిదాలు

కూటమిలో తనకే అత్యధిక స్థానాలలో పోటీ చేయాలని పట్టుపట్టిన కాంగ్రెస్ ప్రచారంలో అంత పదునుగా పాల్గొనలేదు. ఆఖరుకు రాహుల్ గాంధీ కూడా పరిమితంగా తప్ప మీద వేసుకుని ప్రచారం చేసింది లేదు. సంప్రదాయ శివసేన ఓటర్లను ఉద్ధవ్ థాకరే ఆకట్టుకోలేకపోయారు. ఎంవిఎ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందే ఉద్ధవ్‌ను ప్రకటించకపోవడంతో మరాఠా ఆత్మగౌరవ భావన దెబ్బతిన్నదనే ప్రచారం ప్రభావం చూపింది. స్వయంగా ఉద్ధవ్ కూడా ముందే సిఎం పేరు ప్రకటించి వుండాల్సిందని అసంతృప్తి వెలిబుచ్చారు. సిపిఎం, సిపిఐ, ఎస్‌పి వంటి పార్టీలను కలుపుకోవలసిన అవసరాన్ని అసలే గుర్తించలేదు. లోక్‌సభ ఎన్నికలలో సిపిఎంకు సీటే కేటాయించకపోయినా ఓట్ల చీలిక నివారించడం కోసం పోటీ చేయకుండానే మద్దతునిచ్చింది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలలోనూ అనేక విమర్శల తర్వాత మూడు స్థానాలకు అంగీకరించి మళ్లీ ఒకచోట పోటీ పెట్టింది కాంగ్రెస్. దహను, సోలాపూర్, కల్యాన్‌లలో సిపిఎం పోటీ చేస్తుండగా. సేన, ఎన్‌సిపి మూడు చోట్ల మద్దతునిచ్చినా సోలాపూర్‌లో కాంగ్రెస్ పోటీ చేసి బిజెపి గెలవడానికి కారణమైంది. సిపిఎం దహను స్థానంలో పదోసారి విజయం సాధించడం ఒక విశేషం. ఎస్‌పి విషయంలోనూ ఇదే జరిగింది. లోక్‌సభ ఎన్నికలలో గెలుపు తర్వాత కాంగ్రెస్ చూపంతా ముఖ్యమంత్రి పీఠంపైనే వుండి కూటమి భాగస్వాములను కించపర్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ముందుగా సర్దుబాట్లు పూర్తయిన రాష్ట్రం మహారాష్ట్ర కనుకనే ఫలితాలు స్పష్టంగా వచ్చాయి. కానీ ఈసారి హర్యానా తప్పులను పునరావృతం చేసింది కాంగ్రెస్. అక్కడా ఎస్‌పి, ఆప్‌లను అసలు కలుపుకోలేదు. హర్యానా ఓటమి తర్వాత ఆక్రోశం వ్యక్తం చేసింది రాహుల్ గాంధీ కాగా తాజాగా జరిగిన ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆ పని చేశారు. ఏది ఏమైనా కాంగ్రెస్ సంకుచితత్వం, దూరదృష్టి లోపం వల్ల లోక్‌సభ ఎన్నికల విజయంతో వచ్చిన సదవకాశం సగం వెనక్కు పోయినట్టయింది. బలం లేకున్నా ఎక్కువ సీట్లు కావాలని పట్టుపట్టడం, తర్వాత చతికిల పడటం పరిపాటిగా మారింది. బీహార్ ఎన్నికల్లోనూ నాలుగేళ్ల కిందట వెంటపడి మరీ 70 సీట్లు తీసుకుని పోటీ చేసినా ఆ పార్టీ కేవలం 19 గెలవగలిగింది. అదే ఆర్‌జెడి, వామపక్షాల గెలుపు శాతం చాలా ఎక్కువగా వుంది. యు.పి లోనూ అంతే. ఆ రెండిటితో పాటు తమిళనాడులో కూడా 'ఇండియా' వేదిక సీట్లు పెరిగాయంటే అది ఇతర మిత్రుల విజయాల వల్ల తప్ప కాంగ్రెస్ వల్ల కాదు. ఎందుకంటే కాంగ్రెస్ యంత్రాంగం నిర్మాణ బలం విధాన స్పష్టత కూడా తగ్గిపోతున్నాయి. మహారాష్ట్రలో మాలెగావ్ వంటి చోట్ల వచ్చిన ఓట్ల శాతం చూస్తే మైనార్టీలు కూడా కాంగ్రెస్‌కు దూరంగా పోతున్నట్టు అర్థమవుతుంది. మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, ప్రతిపక్ష నేత బాలా సాహెబ్ థోరట్ వంటి వారు కూడా గెలవలేకపోయారు. కాంగ్రెస్ 101 సీట్లలో పోటీ చేసి 16 మాత్రమే తెచ్చుకోగలిగింది. ఇందులో తొమ్మిది విదర్భలోనే. వాయువ్య భారత్‌లో మొత్తం లోక్‌సభ స్థానాలుండగా బిజెపితో ఆ పార్టీ ముఖాముఖి తలపడిన 75 సీట్లలో కేవలం తొమ్మిది మాత్రమే తెచ్చుకోగలిగింది. కనుక తన బలం గురించి అతి అంచనాలు మాని లౌకిక పార్టీలతో ఇచ్చిపుచ్చుకునే రీతిలో వ్యవహరించకపోతే కాంగ్రెస్ కోలుకోవడం కూడా కష్టమే. కార్మిక హక్కులు, రైతాంగ సంక్షోభం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టవలసిన అవసరం కూడా గ్రహించాల్సి వుంది. రైతాంగ ఆందోళనకు మార్గం చూపిన మహారాష్ట్ర ఉద్యమాల ప్రభావం ఎన్నికల ఓటింగులో ప్రతిబింబించలేదంటే కాంగ్రెస్, ఎంవిఎల వైఖరి మాత్రమే కారణం. దీనికి తోడు ఇవిఎంలు, ఓట్ల సంఖ్యలో తేడా వంటివి కూడా పరిశీలించాల్సి వుంది.

జార్ఖండ్ ఉపశమనం

జార్ఖండ్ విషయానికి వస్తే ముఖ్యమంత్రి హేమంత సొరేన్‌ను జైలుపాలు చేసి వెంటాడిన తీరును ఓటర్లు తోసిపుచ్చారు. కూటమిలో కాంగ్రెస్ 16, ఆర్‌జెడి 4, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 2 తెచ్చుకున్నాయి. ఇక బిజెపికి 21 రాగా ఆ కూటమిలోని ఎల్‌జెపి, ఎజెఎస్‌యు, జెడియు లకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. బిజెపి సీట్ల శాతం తగ్గిపోగా 'ఇండియా' వేదిక పార్టీల సీట్లు పెరిగాయి. ఇది కూడా అనేక ఎగ్జిట్ పోల్స్ చెప్పిన దానికి విరుద్ధం. అయితే ఇక్కడ కూడా కాంగ్రెస్ బిజెపితో నేరుగా తలపడిన 12 చోట్ల ఓటమి చవిచూసింది. ఇక ఇప్పుడు జార్ఖండ్ సర్కారు ముందు తీవ్ర ఆర్థిక సవాళ్లు వుంటాయి. కేంద్రం వివక్ష లేకుండా సహకరించాలని హిందూ పత్రిక సంపాదకీయమే రాసింది.

ఉప ఎన్నికల తీరు

ఈ రెండు రాష్ట్రాల శాసనసభలతో పాటు అనేక లోక్‌సభ, శాసనసభల స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా మిశ్రమంగానే వున్నాయి. కేరళలో చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో వెనకబడిన ఎల్‌డిఎఫ్ మళ్లీ పుంజుకున్నదని ఈ ఫలితాలు నిరూపించాయి. ఇక దాని పని ముగిసినట్టేనని బిజెపి, కాంగ్రెస్ అనుకూల శక్తులు రొదపెట్టినప్పటికీ ఓటర్లు అది తప్పని చాటిచెప్పారు. చెలకరలో యుడిఎఫ్ అభ్యర్థి గెలుపు ఖాయమని మీడియా హోరెత్తినా ఎల్‌డిఎఫ్ అభ్యర్థి యుఆర్ ప్రదీప్ 12 వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలుపొందారు. మత పార్టీల సాయంతో పాలక్కాడ్‌ను కాంగ్రెస్ నిలబెట్టుకున్నా ఎల్‌డిఎఫ్ ఓట్లు గణనీయంగా పెరిగాయి. ఇక వయనాడ్‌లో ప్రియాంక గాంధీ అధిక మెజార్టీతో లోక్‌సభకు ఎన్నికైనా ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేని వ్యక్తిగత కుటుంబ వ్యవహారంగానే చూస్తున్నారు.

ఇక రాజస్థాన్‌లో ఎన్నికలు జరిగిన ఏడు సీట్లలో అయిదు బిజెపి ఒకటి, కాంగ్రెస్, ఒకటి ఇతరులు, యు.పి లో మొత్తం 9లో ఏడు బిజెపి (మిత్ర పార్టీలతో సహా), రెండు ఎస్‌పి, బెంగాల్‌లో ఉప ఎన్నికలు జరిగిన మొత్తం ఆరు సీట్లు తృణమూల్, చత్తీస్‌గఢ్‌లో ఒక చోట బిజెపి, పంజాబ్‌లో మూడు చోట్ల ఆప్, కర్ణాటకలో జరిగిన మూడు చోట్ల కాంగ్రెస్, బీహార్‌లో నాలుగుకు నాలుగు బిజెపి గెలుచుకున్నాయి. అంటే ఉత్తర వాయువ్య భారతంలో బిజెపి ఆధిక్యత సాధించగా దక్షిణాదిన మాత్రం వెనకబడిపోయినట్టు మరోసారి వెల్లడైంది. వేర్వేరు పార్టీలు ఈ ఫలితాలను ఎలా విశ్లేషించుకుని భవిష్యత్ విధానాలు రూపొందించుకుంటాయో చూడవలసిందే. ఏమైనా ఒకే దేశం ఒకే ఎన్నిక పాట ఎంత పొరబాటో ఈ రకరకాల ప్రజా తీర్పులతో స్పష్టమైపోతున్నది. ★

స్మృతి గీతం

ఏ తావున వెతకాలి ?

పల్లవి : నీ మోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి
మిన్ను విరిగి మీద పడ్డా నిబ్బరంగా వుండడం
సాటి కళాకారులను అబ్బురంగా సాకటం
ఎంతటి విషయాన్నైనా నిమిషంలో చెప్పటం
మార్క్సిజాన్ని జీవితాన్ని కలగలిపి చెక్కటం
నేర్పడమే జీవితంగా బ్రతికావు ఇన్నాళ్లు
వేలమంది మనసుల్లో చెరగవు నీ ఆనవాళ్లు
నిర్వహణ తన పేరు సుబ్బారెడ్డి అంటుంది
నటన తన చిరునామా ఎలా మార్చుకుంటుంది ?

చరణం : ఒక్క పరిచయంతోనే స్నేహం చిరకాలం
మాట గాని కలిసిందా జరుగు మంత్రజాలం
నీ ప్రతి సంభాషణ నాటకంలో దృశ్యం
ఎలా మనసొప్పింది నీకు అయ్యావు అదృశ్యం
నీ మోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి

చరణం : ఒక్కసారి జ్ఞాపకాలు ఉప్పెనలా దాడిచేస్తే
వేసుకున్న ప్రణాళికలు అనాథలై విలపిస్తే
ప్రజానాట్యమండలి పెద్ద కొడుకు నిష్క్రమణం
రంగస్థల యవనిక అయ్యింది విభ్రమణం
నీ మోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి?

చరణం : ఎలా మొదలెట్టాలో ఎక్కడ మలుపివ్వాలో
డైలాగ్‌లు పంచులుగా మనసునెలా తట్టాలో
అలవోకగా ఆశువుగా నువు చెప్పిన స్క్రిప్ట్‌లు
ఎలా తట్టుకోవాలి వాటి కన్నీటి దక్కులు
నీ మోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి?

చరణం : కళాకారులం మాకు చెప్పలేని ఇగోలు
పనిలో చొరబడకుండా చూపినావు సులువులు
మలుపులు ఆటుపోట్లు ఉద్యమాల సహజమంటూ
కాడి వీడనట్టి గొప్ప సేద్యగాడివి నువ్వు
నీ మోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి?

చరణం : పిల్లల కోడి లెక్క నీ చుట్టూ గుంపు
ఆప్యాయత కురిపిస్తూ సాగు పలకరింపు
ఇట్టే గడిచిపోతుంది ఎంత సమయమైనా
దిగిపోవును ఎంతటి హృదయ భారమైనా
నీమోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి?

చరణం : ప్రజానాట్యమండలి ముద్దుబిడ్డవు నువ్వు
చివరి మాట చిన్నదైనా చెప్పకుండా వెళ్ళావు
పరీక్ష పెట్టేందుకే ఇలా నువ్వు చేసావా
ఏం చేస్తాం భరిస్తాం నీ లక్ష్యం సాధిస్తూ.....
నీ మోమున చిరునవ్వు ఏ తావున వెతకాలి
రాయాల్సిన స్కిట్స్ కొరకు ఎవరిని బ్రతిమాడాలి?

కామ్రేడ్ సుబ్బారెడ్డి స్మృతి గీతం
రచన : దేవేంద్ర, పిఎన్‌ఎం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com


అన్ని విధాలా రాష్ట్రానికి నష్టం

కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పిజిసిఐఎల్ రాజస్థాన్ నుండి అదాని విద్యుత్‌ను రాష్ట్ర సరిహద్దు వరకు ప్రసారం చేస్తుంది. అక్కడి నుండి ఆ విద్యుత్‌ను వ్యవసాయం నిమిత్తం రాష్ట్రమంతటా సరఫరా చేయాల్సినందున ప్రసార, పంపిణీ నష్టాలు ఎక్కువ అవుతాయి. రాజస్థాన్ నుండి సౌర విద్యుత్ పొందటం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు భూమి కేటాయించాల్సిన అవసరం ఉండదని, దానిని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చునని ఆనాడు అదాని-సెకితో ఒప్పందం వ్యవహారంలో ఉన్న అధికారులు వాదించారు. ప్రతి రాష్ట్రం అదే వైఖరి తీసుకుంటే, విద్యుత్ ప్రాజెక్టులు, ఆ మాటకు వస్తే ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమల వంటి వాటి స్థాపనకు, ఉపాధి కల్పనకు, అభివృద్ధికి అవకాశాలు వుండవనేది స్పష్టం. ఇతర రాష్ట్రాల నుండి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందనేది స్పష్టం.

సమస్య



ఎం. వేణుగోపాలరావు



సౌర విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యమున్న కంపెనీలు టెండరు ప్రక్రియలో పాల్గొంటే, అలాంటి సామర్థ్యం లేని కంపెనీలు పేర్కొన్న ధరల కన్నా తక్కువ ధరలను పేర్కొనాలి. అదేవిధంగా, వేలాది మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరాకు టెండరులో పాల్గొనే కంపెనీలు అంత భారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పే అవకాశంతో (ఎకానమీ ఆఫ్ స్కేల్) తక్కువ ధరలను పేర్కొనాలి. అదానీ ఎనర్జీ విషయంలో అలా జరగలేదు. ఆనాడు పోటీ బిడ్డింగులలో అలాంటి సదుపాయంలేని కంపెనీలు తక్కువ సామర్థ్యానికే అదాని రేట్లకన్నా చాలా తక్కువగా రేట్లను పేర్కొనటం వల్ల కొన్ని విషయాలు స్పష్టం అవుతున్నాయి. అదాని చివరకు అంగీకరించిన యూనిట్‌కు రూ.2.42 రేటు చాలా అధికం. సౌర విద్యుత్ ఫలకాలు, తదితర సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న కంపెనీలు మాత్రమే బిడ్డింగులో పాల్గొనటానికి అర్హులని మోడి ప్రభుత్వం సెకీ బిడ్డింగ్ షరతులలో చేర్పించటం, నిజమైన పోటీ లేకుండా అదాని కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చటానికే. అలాంటి ఉత్పత్తి సామర్థ్యం ఉందా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా, ఎవరు అతి తక్కువ రేటును బిడ్డింగులో పేర్కొంటే, ఆ కంపెనీనే ఎంపిక చేసి, సాపేక్షికంగా తక్కువ ధరలకే సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే అవకాశం ఈ షరతుల తొత్తడంతో లేకుండా పోయింది.

అజూర్ కంపెనీ 4000 మె.వా. విద్యుత్ విక్రయాలతో సుమారు 20 ఏళ్ళలో పన్ను చెల్లింపు తరువాత 2 బిలియన్ డాలర్ల గణనీయమైన లాభాలు లభిస్తాయని అంచనా వేసిందని అమెరికా కోర్టులో గౌతమ్ అదానికి, ఇతరులకు వ్యతిరేకంగా దాఖలైన అభిశంసన అభియోగ పత్రంలో (పేరా 45) పేర్కొన్నారు. సాధారణంగా, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఈక్విటీపై 16 శాతం లాభం లెక్కగట్టేవారు. ఉత్పత్తిదారులకు లాభం ఎంత గణనీయంగా ఎక్కువగా ఉంటే, సౌర విద్యుత్ కొనుగోలుదారులకు చార్జీల భారం అంత అధికంగా ఉంటుంది. అదాని-సెకితో ఎపిడి స్కాముల ఒప్పందంలో జరిగింది ఇదే.

టెండర్లు వేశాక 2019 డిసెంబరు 10న సెకి అదాని గ్రీన్‌కు, అజూర్‌కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్‌ఓఎ) ఇచ్చింది. టెండరులోని రిక్వెస్ట్ ఫర్ సెలెక్షన్ (ఆర్‌ఎఫ్‌ఎస్) నిబంధనల ప్రకారం ఎల్‌ఓఎ జారీ చేసిన 90 రోజులలోగా సెకి ఎంపికైన కంపెనీలతో పిపిఎలు చేసుకోవాలి. అయితే పిపిఎలు చేసుకొనేందుకు 18 నెలలకు పైగా ఆలస్యమైంది. ఎందుకంటే, వివిధ రాష్ట్రాల డిస్కాంలకు సెకీ అదాని, అజూర్‌ల నుండి కొనుగోలు చేయడానికి అంగీకరించిన రేట్లకు పిఎస్‌ఎలు చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలను ఆ రేట్లు అధికంగా ఉన్నాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, డిస్కాములు అంగీకరించలేదు. ఆ తరువాత అదాని, అజూర్ కంపెనీలు వాటి అధికారుల ద్వారా 'భారీ ముడుపుల పథకం' నడిపాక, పిపిఎలు చేసుకొనేందుకు మార్గం సుగమమైంది. మె.వా.కు రూ.25 లక్షల చొప్పున ముడుపులను లెక్కగట్టారని, ఆంధ్రప్రదేశ్ అధికారులకు రూ.1750 కోట్ల మేరకు లంచాలు ఇస్తామని హామీ ఇచ్చారని లేదా చెల్లించారని, ఆ అధికారులలో ముఖ్యమంత్రి ఉన్నారని 2021 ఆగస్టులో అదాని గ్రీన్ రికార్డులలో ఎఫ్‌బిఐ దర్యాప్తు అధికారులు కనుగొన్నారని అమెరికా కోర్టులో సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ కమిషన్ (ఎస్‌ఇసి) దాఖలు చేసిన అభియోగ పత్రంలో పేర్కొన్నారు. గౌతం అదాని, సాగర్ అదాని ముఖ్యమంత్రిని 2021 ఆగస్టులో, సెప్టెంబరులో వేర్వేరుగా కలిశారని, ప్రోత్సాహకాలతో సెకితో డిస్కాంలు పిఎస్‌ఎ చేసుకొనకపోవటాన్ని చర్చించారని అభియోగ పత్రంలో పేర్కొన్నారు (పేరాలు 29, 33, 34, 51, 53, 54). ఆ తరువాత రాష్ట్ర మంత్రి వర్గం సెకితో 7000 మె.వా. పిఎస్‌ఎ చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. అధిక ధరలకు ఆ సౌర విద్యుత్ కొనుగోలుకు సెకీతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ప్రోత్సాహకాలు పని చేశాయని అభియోగ పత్రంలో వ్యాఖ్యానించారు.

అదాని సౌర విద్యుత్‌ను రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సరఫరా చేయడానికే కొనుగోలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతమున్న మూడు డిస్కాములు లేదా కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామీణ వ్యవసాయ విద్యుత్ పంపిణీ కంపెనీ, ఈ విద్యుత్‌ను రాష్ట్ర మంతటా సరఫరా చేయాలి. ఆయా ప్రాంతాలలో వ్యవసాయ విద్యుత్ డిమాండు ఆధారంగా అవసరమైన ఉత్పత్తి సామర్థ్యంతో స్థానికంగా సౌర విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పితే అనేక ప్రయోజనాలుంటాయి. వాటి నుండి చుట్టుపక్కల స్థానిక ప్రాంతాలకు విద్యుత్ ప్రసారం, పంపిణీలకు పెట్టుబడుల అవసరాలు, చార్జీలు, ప్రసార, పంపిణీ నష్టాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి ఏర్పాటు అవసరమైన ఓల్టేజి నిర్వహణకు దోహదం చేస్తుంది. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రాజస్థాన్‌లోని అదాని ప్రాజెక్టుల నుండి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే ఏర్పాటుతో రాష్ట్రం, వినియోగదారులు ఈ ప్రయోజనాలను కోల్పోయారు. అంతకు ముందు, రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా 6000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలిచింది ఇలాంటి ఏర్పాట్ల అవకాశాలతోనే. టెండర్ల షరతుల మార్పుపై వివాదాలతో, హైకోర్టు తీర్పుతో, తరువాత సెకితో ఏర్పాటుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చివరకు ఆ టెండర్లను రద్దు చేసుకుంది. కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పిజిసిఐఎల్ రాజస్థాన్ నుండి అదాని విద్యుత్‌ను రాష్ట్ర సరిహద్దు వరకు ప్రసారం చేస్తుంది. అక్కడి నుండి ఆ విద్యుత్‌ను వ్యవసాయం నిమిత్తం రాష్ట్రమంతటా సరఫరా చేయాల్సినందున ప్రసార, పంపిణీ నష్టాలు ఎక్కువ అవుతాయి. రాజస్థాన్ నుండి సౌర విద్యుత్ పొందటం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు భూమి కేటాయించాల్సిన అవసరం ఉండదని, దానిని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చునని ఆనాడు అదాని-సెకితో ఒప్పందం వ్యవహారంలో ఉన్న అధికారులు వాదించారు. ప్రతి రాష్ట్రం అదే వైఖరి తీసుకుంటే, విద్యుత్ ప్రాజెక్టులు, ఆ మాటకు వస్తే ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమల వంటి వాటి స్థాపనకు, ఉపాధి కల్పనకు, అభివృద్ధికి అవకాశాలు వుండవనేది స్పష్టం. ఇతర రాష్ట్రాల నుండి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందనేది స్పష్టం.

/ వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు /

తీరంలో పులి అడుగుజాడలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా) : వజ్రపుకొత్తూరు మండలంలోని తీరప్రాంత గ్రామాలైన మెట్టూరు, ఒంటలూరు చీపురుపల్లి గ్రామాల రహదారుల్లో పులి అడుగు జాడలు కనిపించాయి. పెద్ద పులి ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలుసుకున్న గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. పలాస అటవీశాఖాధికారి పోలయ్య శనివారం సాయంత్రం పులి పాదాలను పరిశీలించారు. ఇవి పులి అడుగులు కావని, పెద్ద నక్క అడుగులు అయి ఉంటాయని చెప్పారు.

అన్నదాత దు:ఖీభవ..!

- పెట్టుబడి సాయం రూ.20 వేలపై రైతుల్లో చర్చ
- రబీ సాగు ప్రారంభమవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- రెండు జిల్లాల్లో సుమారు 2.50 లక్షల మంది రైతుల ఎదురుచూపు
- కౌలురైతులకు అందేలా చర్యలుండేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'అన్నదాత సుఖీభవ' కింద ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారంటూ అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఆర్భాటంగా హామీలు గుప్పించిన కూటమి అధికారంలోకొచ్చి ఆరు నెలలు గడిచినా రైతులకు అందించాల్సిన సాయంపై నోరు విప్పకపోవడం రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఖరీఫ్ పూర్తయ్యిందని, రబీ సాగు ప్రారంభం కావడంతో ఇప్పుడైనా పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రైతులకు రూ.13,500 చొప్పున అందించింది. దీనిలో కేంద్రం మూడు విడతలుగా రూ.ఆరు వేలు జమ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలో మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, రెండో విడతగా రబీ సీజన్‌కు అనువుగా జనవరిలో రూ.రెండు వేలు రైతుల ఖాతాల్లో జమ చేసేది. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం అందుకునేవారు. ఏలూరు జిల్లాలోనే లక్షా 35 వేల మంది వరకూ లబ్ధిదారులైన రైతులు ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామంటూ టిడిపి కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతానికిపైగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో రైతు కుటుంబాలు ఎన్నికల్లో కూటమికి జైకొట్టాయి. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లు టిడిపి కూటమి గెలుచుకుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. పెట్టుబడి సాయానికి గత ప్రభుత్వం రైతు భరోసా అని పేరు పెట్టగా, ఈ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపింది. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ రైతులకు పెట్టుబడి సాయం హామీ మాత్రం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. ఖరీఫ్ పూర్తయ్యి, రబీ ప్రారంభమైనా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం మాట్లాడకపోవడం రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పంట సాగు సమయంలో పెట్టుబడి సాయం అందించకపోతే ఏ విధంగా మేలు జరుగుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది అసలు పెట్టుబడి సాయం ఇస్తారా అనే అనుమానాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం సొమ్ము అందించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందేనా..?

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలు రైతులే చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం పెట్టుబడి సాయం సాగు చేసే రైతులకే అందించాలి. ప్రభుత్వం అందించే సాయం కౌలు రైతులకు అందించాల్సి ఉంది. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని ప్రభుత్వం మాటలతోనే కాలక్షేపం చేస్తోంది. ఇ-క్రాప్‌లో భూ యజమానుల పేర్లే ఉన్నాయి. ఇ-క్రాప్ ఆధారంగా పెట్టుబడి సాయం అందిస్తే భూ యజమానులకే వెళ్లిపోతుంది. సాగు చేసే కౌలురైతులకు ఎటువంటి న్యాయమూ జరగదు. ప్రభుత్వం సాగు చేసే కౌలురైతులకే పెట్టుబడి సాయం రూ.20 వేలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. బ్యాంకులు అందించే పంట రుణాలు సాగుచేసే కౌలురైతులకు అందని పరిస్థితి నెలకొంది. రైతుమిత్ర గ్రూపుల ద్వారా కొద్ది మొత్తంలో రుణాలు అందించి కౌలురైతులకు ఇచ్చినట్లు లెక్కలు చూపుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించడంతోపాటు, సాగుచేసే కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

ఎఎంసిలో పోస్టుల భర్తీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

: ఆంధ్ర వైద్య కళాశాలలో 29 కాంట్రాక్టు, 71 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు తెలిపారు. వీటిలో 10 కాంట్రాక్ట్ పోస్టుల మెరిట్ జాబితా, 71 అవుట్ సోర్సింగ్ పోస్టులకు ప్రొఫెషనల్ మెరిట్ లిస్ట్ జాబితా ఆంధ్ర వైద్యకళాశాల అధికారిక వెబ్సైట్ www.amc.edu.in నందు విశాఖపట్నం NIC website www.visakhapatnam.ap.gov.in recruitmentamcgreivances@gmail.com నందు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరణకు 10 రోజులు గడువు ఇచ్చినట్లు తెలిపారు.

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై పునరాలోచిస్తాం

ఎంపి పుట్టా మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ప్రతిపాదిత నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటుపై పునరాలోచన చేస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే భావనతో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు తాను కృషి చేసినట్లు ఎంపీ పేర్కొన్నారు. అయితే స్థానిక ప్రజల మనోభావాలు, పలు సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియపై పునరాలోచన చేస్తున్నామని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఈ ప్రాజెక్టు విషయంలో స్థానికుల అభిప్రాయాలను గౌరవిస్తామని తెలిపారు.

దీపం కోసం ఎదురు చూపు

- సిలిండర్‌కు రూ.3.90 జమ
- రెండు వారాలవుతున్నా పడని రాయితీ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి పట్టణానికి ఆనుకొనివున్న కొత్తూరు పంచాయతీలోని శారదనగర్ 11 వీధిలో నివాసముంటున్న కె ఈశ్వరరావు అప్న ఇండేన్ సర్వీస్ అడహక్ పాకాసాసా గ్యాస్ ఏజెన్సీ నుంచి నవంబరు 15న యథావిధిగా రూ.850 చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకున్నాడు. వినియోగదారుని నెంబరు 7553204813. ఆధార్, ఫోన్ నెంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానంతో ఈకెవైసి చేసుకున్నాడు. అయినా 29వ తేదీ వరకు ఆయన బ్యాంకు ఖాతాలో రాయితీ సొమ్ము జమకాలేదు. గతంలో వలె రూ.3.90 పైసలు జమైనట్లు ఆయన ఫోన్ నెంబర్‌కు సమాచారం వచ్చింది. తనకు ఉచిత గ్యాస్ రాయితీ సొమ్ము పడని విషయం ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని ఈశ్వరరావు వాపోయాడు. ఇతని వలె గ్యాస్ రాయితీ సొమ్ము పడనివారు అనేక మంది ఉన్నారు.

దీపం-2 పథకం అమల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. ఈకెవైసి చేసుకున్నా లబ్ధిదారులందరికీ రాయితీ సొమ్ము జమకావడంలేదు. టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసినా పరిష్కారం కావడంలేదు. సిలిండర్ అందిన కొద్ది రోజుల వ్యవధిలో కొందరి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. కొందరికి వారం రోజులు పడుతోంది. ఈశ్వరరావు వలె కొందరికి రెండు వారాలవుతున్నా రాయితీ సొమ్ము జమకావడంలేదు. సకాలంలో డబ్బులు జమకాకపోవడంతో ఉచిత గ్యాస్ తమకు వర్తించదన్న ఆందోళనలో లబ్ధిదారులున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము జమకాక నిరాశ చెందుతున్నారు. సిలిండర్ అందిన 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమవుతుందని ప్రభుత్వం చెప్పింది. కానీ, అమల్లో ఇంకా లోపాలు కొనసాగుతున్నాయి. ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఏడాదిలో నాలుగు నెలలకు ఒకటి చొప్పున మూడు సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. అందులో భాగంగా తొలి దశలో సిలిండర్‌కు రాయితీ సొమ్ము రాకపోవడంతో మిగిలిన రెండు సిలిండర్లకు డబ్బులు రావన్న నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలో 5.17 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో దీపం, ఉజ్వల-1, ఉజ్వల-2, సిఎస్ఆర్ (స్త్రీ), సాధారణ కేటగిరీలో గ్యాస్ కనెక్షన్ పొందిన 3.60 లక్షల మందిని ఉచిత గ్యాస్ పొందడానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇప్పటికి 1.37 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము రూ.807లు తమ ఖాతాలో జమైనట్లు సమాచారం రాక రోజూ బ్యాంకులకు వెళ్లి రాయితీ సొమ్ముపై అడిగి తెలుసుకుంటున్నారు. అయితే అధికారులు మాత్రం సిలిండర్ తీసుకున్న వారందరికీ రాయితీ సొమ్ము జమవుతుందని చెబుతున్నారు.

పారా లీగల్ వలంటీర్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్స్ పథకం క్రింద ఒక ఏడాది పని చేసేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఒక ప్రకటనలో తెలిపారు. మెట్రిక్యులేషన్ లేదా దానితో సరి సమానమైన అర్హత కలిగిన 18 సంవత్సరాలు నిండిన వారు డిసెంబర్ 21వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖపట్నంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమా హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడు వేణుభాస్కర్‌రెడ్డిని ఎయిర్‌పోర్టు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కొంత కాలంగా నిందితుడు దేశంలో వివిధ ప్రాంతాల్లో దాక్కొని తప్పించుకు తిరుగుతుండటంతో పోలీసులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా వేణు భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వేణు భాస్కర రెడ్డి జమీమాతో సహజీవనం చేసి, ఆమె చేసిన నేరాల్లో ప్రధాన సభ్యుడుగా ఉంటూ దాడులు, హత్యా ప్రయత్నాలలో భాగమయ్యాడు. వివాహమైన పురుషులను మత్తులోనికి దించే ప్రక్రియలో కీలక పాత్ర పోషించాడని, బెదిరింపుల ద్వారా భారీగా నగదు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో మరి కొన్ని ప్రాంతాల్లో నమోదైన కేసుల్లో ఇంకా దర్యాప్తు జరుగుతుందని అధికారులు తెలిపారు. జాయ్ జమీమా విశాఖపట్నంలో ధనికులు, వివాహమైన పురుషులను లక్ష్యంగా చేసుకుని వారితో మోసపూరిత ప్రేమాయణం, సహజీవనం, నిశ్చితార్థాలు చేసుకుని వారిని బెదిరించి రూ.లక్షలు వసూలు చేసి చివరకి వారిపై దాడులు, హత్యా ప్రయత్నాలు చేయించి అరెస్ట్ అయి జైలులో ఉన్న విషయం విదితమే.

జోరు వర్షంలోనూ కొనసాగిన దీక్షలు



ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖలోని పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుపరం చేయవద్దంటూ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన దీక్షలు శనివారం 61వ రోజుకు చేరుకున్నాయి. బోరున కురుస్తున్న వర్షంలోనూ ఆందోళన కారులు పోర్టు యాజమాన్యానికి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా దీక్షలను కొనసాగించారు. ఈసందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఉద్యోగులు, కార్మికులు కష్టార్జితంతో ఏర్పాటైన గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దీనిపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 40వేల మంది పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబీలకు ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ సమస్యను నేతలు నిర్లక్ష్యం చేయడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో జక్కాన సత్యనారాయణ, సాంబమూర్తి, శంకరరావు పైడిరాజు, నాయుడు, కెఎస్ కుమార్, మురళి, బి జగన్ పాల్గొన్నారు

తుపాను ప్రభావిత జిల్లాల్లో అధికారులు సెలవులు పెట్టొద్దు : మంత్రి అచ్చెన్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫెంగల్ తుపాను ప్రభావిత జిల్లాలైన చిత్తూరు, తిరుపతి, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులు సెలవులు పెట్టకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీర ప్రాంతాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తుపాను ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

టూరిజం హబ్‌కు సహకరించండి..

కేంద్ర పర్యాటక మంత్రికి ఎంపి విజ్ఞప్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు పార్లమెంటును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. విజయనగరం రెండవ రాజధానిగా కీర్తి గడించిన చంద్రగిరి కోటను పరిరక్షించి, ఆధునిక యుగానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎంపీల బృందం, కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట, రాజమండ్రిలోని హేవలాక్ వంతెన, పుష్కర ఘాట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కెటాయించిన నేపథ్యంలో కేంద్ర పర్యాటక మంత్రికి పుష్ప గుచ్చం అందించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

అలక పాన్పుపై ఏక్‌నాథ్ షిండే

- ముంబయి వీడి సొంతూరిలో మకాం
- భవిష్యత్‌పై ఒకట్రెండు రోజుల్లో కీలక ప్రకటన
- 5న సిఎం పదవీ స్వీకార ప్రమాణానికి బిజెపి ఏర్పాట్లు



అజిత్ పవార్ దేవేంద్ర ఫడ్నవీస్ ఏక్‌నాథ్ షిండే

ముంబయి : మహారాష్ట్ర అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అలకబూనారా? బిజెపి పెద్దలతో వరుస భేటీల అనంతరం అనారోగ్య సమస్యల పేరిట ఆయన ముంబయి వీడి తన సొంతూరు సతారా జిల్లాలోని దారే తంబ్ గ్రామానికి మకాం మార్చడం, మరోవైపు పేరు ఖరారు చేయకుండానే ఈ నెల 5న ముఖ్యమంత్రి పదవీస్వీకార ప్రమాణోత్సం జరుగుతుందని, ప్రధాని మోడీ హాజరవుతారని బిజెపి ప్రకటించడం వంటి పరిణామాలు చూస్తే ఏక్‌నాథ్ అసంతృప్తితో ఉన్నట్లు తెలిసిపోతుంది. ఆయన అనుచరులు, శివసేన చీలిక గ్రూపు నేతలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఏక్‌నాథ్ షిండే భవిష్యత్‌పై కీలక ప్రకటన చేయనున్నారని శివసేన నాయకులు సంజయ్ శిర్సాత్ శనివారం ప్రకటించారు. అయితే ఏక్‌నాథ్ షిండే వరుస పర్యటనల వల్ల తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని, ఇతర శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు కూడా ఉన్నాయని ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులు తెలిపారు.

ముఖ్యమంత్రి ఎవ్వరో..!

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరో ఇప్పటికీ బిజెపి అధిష్టానం తేల్చడం లేదు. దేవేంద్ర ఫడ్నవీస్ సిఎం అవుతారా.. లేక మరొకరిని తీసుకువచ్చి సిఎం కుర్చీపై కూర్చోపెడతారా..అన్న ఉత్కంఠ నెలకొంది. మహాయుతికి మెజార్టీ వచ్చిన వారం రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవ తేదీని ప్రకటించారు. డిసెంబర్ 5న సాయంత్రం 5 గంటలకు ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని మహారాష్ట్ర బిజెపి అధ్యక్షులు చంద్రశేఖర్ బవాన్‌కులే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నారని తెలిపారు. అయితే సిఎం ఎవరన్నది మాత్రం ప్రస్తావించక పోవటం గమనార్హం. అయితే కొత్త సిఎంగా బిజెపి సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతున్నా.. రేసులో కొత్తగా మురళీధర్ మోహెూల్ పేరు తెరపైకి వచ్చింది. బిజెపి పుణె ఎంపి అయిన మురళీధర్ ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఈయన మహారాష్ట్ర సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండగా ఆ పోస్టులపై మురళీధర్ స్పందించారు. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. ఇదంతా బాగానే ఉన్నా... మరి ఫడ్నవీస్ సిఎం క్యాండెట్ అయితే..ప్రమాణ స్వీకారోత్సవ ముహూర్తం ఖరారు చేసి పేరు ఎందుకు ప్రకటించలేదనే ప్రశ్న ఉదయిస్తోంది. అంటే అటు ఫడ్నవీస్, ఇటు షిండే కాకుండా మరొకరిని తెచ్చి సిఎం పీఠంపై కూర్చోపెట్టాలని బిజెపి అధిష్టానం ఎత్తులు వేస్తుందా అని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు సీఎం రేసులో మురళీధర్, వినోద్ తావ్డే, రాధాకృష్ణ, విఖే-పాటిల్ వంటి ప్రత్యామ్నాయ పేర్లను అగ్రనాయకత్వం పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

కేజ్రీవాల్‌పై లిక్విడ్ దాడి

- ఢిల్లీ పాదయాత్రలో ఘటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై మరోమారు దాడికి యత్నం జరిగింది. దక్షిణ ఢిల్లీలో మాలవీయ నగర్‌లోని సావిత్రి నగర్‌లో శనివారం అరవింద్ కేజ్రీవాల్ పాదయాత్ర చేస్తుండగా ..ర్యాలీలో ఉన్న వ్యక్తి ఒకరు ఆయనపై లిక్విడ్ చల్లారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ తరహాలో కేజ్రీవాల్‌పై దాడి జరగడం గడిచిన నెల రోజుల్లో ఇది మూడో సారి. తాజా ఘటనలో లిక్విడ్ చల్లిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తిని మలవీయనగర్‌కే చెందిన అశోక్ ఝూగా గుర్తించారు.

దేశ రాజధానిలో భద్రత కరువు : ఆప్

దేశ రాజధాని నగరంలో శాంతిభద్రతలు సన్నగిల్లాయని ఆమాద్మీ పార్టీ విమర్శించింది. మాజీ ముఖ్యమంత్రే సురక్షితంగా తిరిగే పరిస్థితి నగర వీధుల్లో లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని? దీనికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని ఆ పార్టీ పేర్కొంది. బిజెపి పాలనలో ఢిల్లీ శాంతిభద్రతలకు పూర్తిగా విఘాతం కలిగిస్తోందని విమర్శించింది. కేజ్రీవాల్‌పై దాడి వెనుక బిజెపి హస్తం ఉందని ఆప్ నేత సౌరభ్ భరద్వాస్ అనుమానం వ్యక్తం చేశారు.

సంభాల్‌లో బయట వ్యక్తులపై నిషేధం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని షాహి జామా మసీదు సర్వే సందర్భంగా చోటుచేసుకున్న నిరసనలు, పోలీసుల అణిచివేత చర్యల నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న దరిమిలా స్థానిక అధికార యంత్రాంగం పలు ఆంక్షలు విధించింది. శాంతిభద్రతలను కాపాడే చర్యల్లో భాగంగా బయట వ్యక్తులపై డిసెంబరు 10వ తేదీ వరకు నిషేదం విధిస్తున్నట్లు జిల్లా మెజిస్ట్రేట్ రాజేంద్ర పెన్సియా శనివారం తెలిపారు. నవంబర్ 19న జరిగిన పోలీసుల కాల్పుల్లో నలుగురు ముస్లింలు మరణించడంతో పాటు అనేకమంది గాయపడిన నేపథ్యంలో సంభాల్‌లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. బయట వ్యక్తులు కానీ, సామాజిక సంస్థలు కానీ, ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే డిసెంబర్ 10 వరకు అనుమతి లేకుండా జిల్లా సరిహద్దులోకి ప్రవేశించరాదని జిల్లా మెజిస్ట్రేట్ పేర్కొన్నారు. కాగా, ఈ హింసపై నివేదిక సమర్పించడానికి సమాజ్‌వాద్‌పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సూచన మేరకు 15 మందితో ఆ పార్టీ ప్రతినిధి బృందం సంభాల్‌కు వెళ్లనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షులు శ్యామ్ లాల్ పాల్ శనివారం ప్రకటించారు. అయితే అఖిలేష్ స్పందన తర్వాతనే ఆ జిల్లా యంత్రాంగం.. నిషేధం విధించడం గమనార్హం.

చిన్మయ్ దాస్ అరెస్టుకు బంగ్లా సమర్ధన

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందూ పూజారి చిన్మయ్ కృష్ణ దాస్ (ఇస్కాన్) అరెస్టు చేయడాన్ని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం సమర్థించుకుంది. ఐరాస ఫోరమ్‌కు ఈ మేరకు ఒక లేఖ రాస్తూ చిన్మయ్ దాస్ అరెస్టును కొందరు తప్పుగా అర్ధం చేసుకున్నారు. నిర్దిష్ట ఆరోపణలతోనే అరెస్టు చేశాం. ఈ అంశం ఇప్పుడు కోర్టు మందున్నది అని జెనావాలోని ఐరాస మానవ హక్కుల సంస్థకు తెలియజేసిందని ఐరాసలో బంగ్లాదేశ్ రాయబారి తారిక్ మహ్మద్ అరిఫుల్ ఇస్లాం పేర్కొన్నారు.జెనీవాలో మైనార్టీల సమస్యలపై ఫోరమ్ 17 సెషన్‌నుద్దేశించి అరిఫుల్ ఇస్లాం మాట్లాడుతూ హిందూ నాయకుడిపై పథకం ప్రకారం దాడి చేశామనడం నిరాధారమని అన్నారు.

రెగ్యులర్ వేతన ఉద్యోగాల్లో కేరళ రికార్డ్

కొచ్చి : రెగ్యులర్ వేతనాల ఉద్యోగాల్లో గత ఐదేళ్ళ కాలంలో కేరళ అధిక వృద్ధిని సాధించిందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ఉపాధి రంగం నిరాశాజనకమైన రీతిలో వున్న తరుణంలో ప్రధాన రాష్ట్రాలన్నింటిలోకి కేరళలోనే ఈ పురోభివృద్ధి చోటు చేసుకుందని పేర్కొంది. 2018-19 నుండి 2023-24 మధ్య కాలంలో కేరళలో రెగ్యులర్ వేతన జీవుల వేతనాల్లో 6.2 పర్సంటేజ్ పాయింట్లు పెరిగాయి. ఇదే సమయంలో జాతీయ సగటు 2 పర్సంటేజ్ పాయింట్లు తగ్గాయి.

ఉపాధి, వేతన ప్రామాణికాలకు సంబంధించి 28 రాష్ట్రాల వ్యాప్తంగా కార్మికుల గణాంకాలను విశ్లేషిస్తూ స్టేట్ లేబర్ ఫోర్స్ డైజెస్ట్ ఒక సమగ్ర విశ్లేషణ ఇచ్చింది. ఎన్ఎస్ఎస్ఓ, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్), ఇతర వనరుల నుండి వచ్చిన డేటాను ఈ నివేదిక ఉపయోగించుకుంది. 2023-24లో కేరళలో రెగ్యులర్ వేతనాలు పొందే కార్మికులు 38.9 శాతం మంది వున్నారని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్‌లో సీనియర్ విశ్లేషకులు పరస్ జస్రాయ్ తెలిపారు. 2018-19లో కేరళలోని మొత్తం ఉద్యోగాల్లో ఈ వాటా 32.7శాతంగా వుంది. రాష్ట్రానికి సంబంధించినంతవరకు ఇది రికార్డు. అంటే కార్మికులు రెగ్యులర్ వేతనాలు కలిగిన ఉద్యోగాలను పొందుతున్నారని తెలుస్తోంది. జాతీయ సగటు 23.2 శాతం కన్నా ఇది చాలా ఎక్కువని ఆయన పేర్కొన్నారు. కేరళలో ప్రైవేటు రంగంలో వ్యవసాయేతర ఉద్యోగాల వాటా కూడా 2018-19లో 6 శాతం వుంటే 2023-24కు వచ్చేసరికి 8.2 శాతానికి పెరిగింది. అదే సమయంలో, ప్రభుత్వ రంగంలో కార్మికుల వాటా కూడా 12.7 శాతానికి పెరిగింది. వ్యవసాయ కార్యకలాపాల్లో వున్న కార్మికుల నిష్పత్తి 27శాతంగా వుంది. ఆ తర్వాత స్థానంలో వాణిజ్య, రవాణా-గిడ్డంగి రంగాల్లో వరుసగా 21.3, 13.4శాతాలుగా వున్నాయి. 2023-24లో ప్రధానంగా ఉపాధి కల్పించింది తయారీ రంగమే, 9.9 శాతం మేర కార్మికులకు ఉద్యోగాలిచ్చిందని ఆ నివేదిక పేర్కొంది.

సభ సజావుగా సాగేనా?

- పార్లమెంటులో నాలుగు రోజులు వాయిదా పర్వమే

న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఎలాంటి చర్చలూ లేకుండానే వాయిదాలతో ముగుస్తున్నాయి. అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్‌లో హింస, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాలపై చర్చకు కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాల సభ్యులు డిమాండ్ చేస్తుంటే అందుకు మోడీ సర్కార్ సిద్ధపడటం లేదు. దీంతో ఉభయ సభల్లోనూ వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ నెల 25న పార్లమెంటు సమావేశాలు మొదలైనప్పటి నుంచీ నాలుగు రోజుల పాటు ఇదే తీరు కొనసాగింది. రాజ్యాంగంతో పాటు అదానీ లంచం, ముడుపుల వ్యవహారం, యూపీలోని సంభాల్ హింస, మణిపూర్ అల్లర్లపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. కేంద్రం మాత్రం అందుకు ససేమిరా అంటున్నది. దీంతో ఉభయ సభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ఇటు లోక్‌సభ స్పీకర్, అటు రాజ్యసభ చైర్మెన్‌లు సభలను వాయిదా వేస్తున్న పరిస్థితులు పార్లమెంటు సమావేశాల్లో కనబడ్డాయి. ఈ ప్రతిష్టంభనకు ముగింపు పలికి, సమావేశాలు సజావుగా సాగేందుకు కేంద్రం, ప్రతిపక్షాలు కలిసి చర్చించే అవకాశం ఉన్నదని విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా, రాజ్యాంగంపై రెండు రోజుల చర్చ కోసం ప్రతిపక్షం పట్టుబడుతున్నది. ఒకవేళ దీనిపై ఇరు పక్షాలూ ఏకాభిప్రాయానికి వస్తే.. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగే అవకాశాలున్నాయని తెలుస్తోంది. బ్యాంకింగ్ చట్టాలు, రైల్వే చట్టం వంటి బిల్లులు, వాటిపై చర్చ, ఆమోదం తొలుత జరగాలని ఒకపక్క కేంద్రం ప్రతిపాదిస్తున్నదనీ, అయితే వాటి కంటే ముందు రాజ్యాంగంపై చర్చ జరగాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని సంబంధిత విశ్లేషకులు చెబుతున్నారు. సభ సజావుగా జరగాలని కేంద్రం కోరుకుంటే.. తమ డిమాండ్‌కు ప్రభుత్వం ఆమోదిస్తుందని ప్రతిపక్షాలు అంటున్నాయని తెలిపాయి. ఇందులో భాగంగా, ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ కె.సి వేణుగోపాల్, లోక్‌సభలో చీఫ్ విప్ కొడికున్నిల్ సురేష్‌లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిసి, చర్చించినట్టు తెలిసింది. బిజెపి అధ్యక్షులు, రాజ్యసభ ఎంపి జెపి నడ్డా సైతం ఈ సమావేశంలో ఉన్నట్టు సమాచారం. రాజ్యసభ బిఎసి సమావేశంలో భాగంగా, రాజ్యాంగంపై రెండు రోజుల చర్చ జరపాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోవటానికి నడ్డా సమ్మతి తెలిపినట్టు సమాచారం. ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులైన రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు.. రాజ్యాంగంపై రెండు రోజుల చర్చ నిర్వహించాలని స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మెన్ జగ్‌దీప్ ధన్కర్‌కు లేఖ కూడా రాసిన సంగతి తెలిసిందే.

ఇటలీలో కార్మికవర్గం కన్నెర్ర

- మెలోనియా బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాపిత సమ్మె

రోమ్: ఇటలీలో కార్మిక వర్గం అపూర్వమైన సమ్మె చేసింది. పచ్చి మితవాది మెలోనియా ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా ఇటలీలోని కార్మిక సంఘాలన్నీ కలసి శుక్రవారం 8 గంటల సార్వత్రిక సమ్మె చేశాయి. వేలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె వల్ల దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు స్తంభించిపోయాయి. స్కూల్స్, ఆస్పత్రులు, స్థానిక రవాణాకు తీవ్ర అంతరాయమేర్పడింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుండడం, తక్కువ వేతనాలు, ప్రజా సేవలను నిర్వీర్యం చేయడం వంటి చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. దేశంలో వేతనాలు తక్కువగా ఉండడం వల్ల చాలా మంది ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారని, దీని వల్ల హెల్త్ కేర్ సెక్టార్‌లో నర్సుల కొరత తీవ్రంగా ఉందని రోమ్‌కు చెందిన కార్యకర్త అన్నా సల్సా చెప్పారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని ఒకరికి రోజుకు రెండు మూడు షిఫ్టులు వేస్తున్నారని అన్నారు.



శుక్రవారం రోమ్‌లో కదంతొక్కిన కార్మిక వర్గం



టెహ్రాన్‌లో పాలస్తీనాకు సంఘీభావంగా నిర్వహిస్తున్న ప్రదర్శన

పాలస్తీనియన్లకు వెల్లివిరిసిన సంఘీభావం

- పాలస్తీనా అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవ సందర్భంగా పలు దేశాల్లో ర్యాలీలు

లండన్/టెహ్రాన్: పాలస్తీనియన్లకు సంఘీభావం తెలియజేయడం కోసం ఐక్యరాజ్య సమితి నవంబరు29 వ తేదీని ప్రపంచ సంఘీభావ దినంగా 1977లో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి యేటా ఈ సంఘీభావ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాపితంగా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది సంఘీభావ దినోత్సవ సందర్భంగా క్యూబా, ఇరాన్, వెనిజులా, ఆఫ్రికా తదితర దేశాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి పాలస్తీనీయులకు సంఘీభావంగా నిలిచారు. సంఘీభావ దినం సందర్భంగా శాంతిని కోరుకునే వివిధ సంఘాలతో కూడిన కూటమి కార్యకర్తలు ప్రపంచ వ్యాపితంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. ఇజ్రాయిల్ గాజాలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని వారు దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. యుద్ధానికి వెంటనే నిలిపివేయాలని, బందీలను తిరిగి అప్పగించాలని కోరుతూ ఇజ్రాయిల్ అంతటా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు శాంతి కార్యకర్తలతోబాటు ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ సారథ్యం వహించింది. క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ ఎక్స్‌లో పోస్టు పెడుతూ గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ చేస్తున్న ప్రతి దాడి అనేక మంది అమాయక పౌరుల ప్రాణాలను తీస్తుందని అన్నారు. ఐరాస చీఫ్ గుటెరస్ మాట్లాడుతూ, పాలస్తీనాకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని అన్నారు.పాలస్తీనా శరణార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచం చాలా కాలంగా ఈ శరణార్థుల సంక్షోభాన్ని పరిష్కరించకుండా అలా వదిలేసిందని ఆయన వాపోయారు.

యువతులు, బాలికల్లో అధికంగా హెచ్ఐవి ఇన్ఫెక్షన్లు !

- అందుబాటుల్లో లేని చికిత్సలు, ముందస్తు నివారణ చర్యలు
- యునిసెఫ్ నివేదిక వెల్లడి

న్యూయార్క్ : యువతులు, బాలికల్లో గతేడాది అత్యధికంగా హెచ్ఐవి ఇన్ఫెక్షన్లు సోకడం పట్ల ఐక్యరాజ్య సమితి బాలల నిధి (యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. వారికి చికిత్స అందుబాటులో వుండడం లేదని, పైగా ఈ ఇన్ఫెక్షన్లు సోకకుండా ముందస్తు నివారణ చర్యలు కూడా లేవని హెచ్చరించింది. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యునిసెఫ్ ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో 15 నుండి 19ఏళ్ళ లోపు వయస్సు గల వారిలో 96 వేల మంది బాలికలకు, 41 వేల మంది బాలురకు హెచ్ఐవి సోకిందని ఆ నివేదిక పేర్కొంది. అంటే యుక్త వయస్సుకు వచ్చిన బాలికల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చింది. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో, ఈ సంఖ్య ప్రతి పది మందిలో 9గా వుంది. 2023లో దాదాపు 13 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యుఎన్ఎయిడ్స్ సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. వారిలో ఎయిడ్స్ కారణాలతో 6.3 లక్షల మంది మరణించారని తెలిపింది. 2030 కల్లా ప్రజారోగ్యానికి ముప్పుగా వున్న ఎయిడ్స్‌ను నిర్మూలించాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన దాని కన్నా మూడు రెట్లు ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యునిసెఫ్ అసోసియేట్ డైరెక్టర్ అనురిత బెయిన్స్ తెలిపారు.

సాధించాల్సిన లక్ష్యాలు మిగిలేవున్నాయి ..

కొత్త హెచ్ఐవి ఇన్ఫెక్షన్లను, ఎయిడ్స్ సంబంధిత మరణాలను తగ్గించడంలో భారత్ కొంత మేరకు పురోగతి సాధించినా సాధించాల్సింది ఇంకా చాలా ఉందని ఎయిడ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా పేర్కొంది. పురోగతి కనిపిస్తున్నప్పటికీ నిధులు, విరాళాలు తగ్గుతున్నందున ఈ కృషిని నిలకడగా కొనసాగించడానికి అవరోధాలు ఎదురవుతున్నాయని పేర్కొంది.

బ్రెజిల్‌లో గణనీయంగా తగ్గిన నిరుద్యోగిత రేటు

రియో డి జెనీరో : బ్రెజిల్ నిరుద్యోగిత రేటు గణనీయంగా తగ్గింది. 2012 మొదలు ఇప్పటి వరకు అత్యంత కనిష్టంగా గత ఆగస్టు - అక్టోబరు కాలంలో ఇది 6.2 శాతంగా నమోదైంది. ఇందుకు సంబంధించిన గణాంకాలను బ్రెజిల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోగ్రఫీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐబిజిఇ) శుక్రవారం వెల్లడించింది. వాస్తవానికి 2017-19 మధ్యకాలంలోనే నిరుద్యోగిత రేటు తగ్గినా..కోవిడ్ కారణంగా 2020లో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని, లేబర్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. అయితే ఆ తర్వాత ప్రత్యేకించి 2022 నుంచి క్రమంగా ఉపాధి అవకాశాలు పెరుగుతూరావడంతో నిరుద్యోగిత గణనీయంగా తగ్గుతూవచ్చిందని తెలిపింది. ప్రభుత్వం చేపట్టిన వివిధ ఉపాధి కల్పన కార్యక్రమాల వల్లే ఇది సాధ్యమైందని ఐబిజిఇ విశ్లేషించింది. సగటు నిజ వేతనాలు కూడా ఆగస్టు-అక్టోబరు త్రైమాసికంలో 0.8 శాతం పెరిగినట్లు పేర్కొంది. శ్రమజీవులకు సగటున రూ.46 వేలు చొప్పున నిజ వేతనం అందుతున్నట్లు తెలిపింది.

ట్రంప్‌తో కెనడా ప్రధాని ఆకస్మిక భేటీ

పామ్ బీచ్ : అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కావడానికి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడే శనివారం ఫ్లోరిడా చేరుకున్నారు. అయితే ఆకస్మికంగా జరుగుతున్న ఈ భేటీకి టారీఫ్ హెచ్చరికలే కారణమని భావిస్తున్నారు. ట్రంప్ ఎస్టేట్‌లో ఆయనతో కలిసి విందు సమావేశంలో పాల్గొంటారు. కెనడా దిగుమతులపై టారిఫ్‌లను పెంచుతామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో వీరి సమావేశం జరగనుంది. ట్రంప్ హెచ్చరికల ప్రభావాన్ని అటు మెక్సికో, ఇటు కెనడాలు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలావుండగా కొన్ని అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించే అంశాన్ని కెనడా కూడా పరిశీలిస్తోంది. ట్రంప్ హెచ్చరికల వల్ల తలెత్తే ఆర్థిక ప్రభావాన్ని తగ్గించుకునేందుకు కెనడా ప్రయత్నిస్తోంది. కెనడా ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా అమెరికాపై ఆధారపడి వుంది. దాదాపు 75 శాతం ఎగుమతులు అమెరికాకే వెళతాయి. ఈ వాణిజ్యంలో ఏ మాత్రం అంతరాయం కలిగినా అది సుదూర కాలంలో తీవ్ర పర్యవసానాలను కలగచేస్తుంది. పైగా ట్రూడే దేశీయంగా కూడా రాజకీయ, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ట్రంప్ బెదిరింపుల వల్ల అమెరికా, కెనడా, మెక్సికో దేశాలతో సంబంధాలు దెబ్బ తింటాయని బైడెన్ ఇప్పటికే వ్యాఖ్యానించారు.



చెన్నైలో జలమయమైన వీధులు

ఫెంగల్.. పరేషాన్

చెన్నై : ఫెంగల్ తుపానుతో తమిళనాడు ఉత్తర కోస్తా తీర ప్రాంతాలను అతలాకుతలం చేసింది. తుపాను తీరం దాటే సమయంలో తమిళనాడు, పుదుచ్చేరిలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.. బకింగ్ హామ్ కెనాల్‌కు వరద నీరు పోటెత్తింది. వరద బాధితులను ఆదుకునేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆదేశించారు. చెన్నైలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి సహాయక చర్యలపై ఆయన సమీక్షించారు. మరో రెండు మూడు రోజుల పాటు గాలులు, వర్షాలు ఉండొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. వరద బాధితులను సహాయ పునరావాస కేంద్రాలకు తలరలించి, కమ్యూనిటీ కిచెన్‌లు ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా సహాయక ఏర్పాట్లు

ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదముందని వాతావరణ విభాగం హెచ్చరించడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసింది. చెన్నయ్ విమానాశ్రయంలో విమాన సర్వీసులన్నిటినీ రద్దు చేశారు. విమానాశ్రయాన్ని డిసెంబరు 1వ తేదీ ఉదయం 4 గంటల వరకు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యగా చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టు జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు. కారణంగా భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో మొత్తం 2,229 శిబిరాలు ప్రారంభించారు. నాగపట్నం, తిరువారూర్ జిల్లాలకు చెందిన 470 మందికి పైగా ప్రజలను ఆరు సహాయ శిబిరాలకు తరలించారు. సముద్ర తీర ప్రాంత జిల్లాల్లో అధికారులు జారీ చేసిన సలహా మేరకు 4,100కు పైగా మత్స్యకార పడవలు తిరిగొచ్చాయి. వర్షానికి నేలకూలే చెట్లను తొలగించడానికి హైడ్రాలి, టెలిస్కోపిక్ పరికరాలతో సహా 489 ప్రత్యేక యంత్రాలను సిద్ధం చేశారు. రైల్వే వంతెన పనుల కోసం తాత్కాలికంగా మూసివేయబడిన గణేశపురం మినహా మిగిలిన 22 సబ్‌వేలు పని చేస్తున్నాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 329 సహాయ కేంద్రాలను సిద్ధం చేసింది. వాటిలో ఆహారం, నీరు మరియు పారిశుద్ధ్య సౌకర్యాలు ఉన్నాయి. 103 బోట్ల ద్వారా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

గుజరాత్ స్థానిక కోర్టులలో 15.61 లక్షల పెండింగ్ కేసులు

గాంధీనగర్ : గుజరాత్‌లోని స్థానిక కోర్టులలో పెండింగ్ కేసులు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మొత్తం 15.61 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. కేంద్రం తెలిపిన సమాచారం ప్రకారం.. ఈ ఏడాది నవంబర్ 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, సబార్డినేట్ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు 15,61,196గా ఉన్నాయి. ఇందులో 3,50,166 సివిల్ కేసులు, 12,11,030 క్రిమినల్ కేసులు ఉన్నాయి. అలాగే, ఇదే ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అదనంగా 50,128 కేసులు ఫ్యామిలీ కోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇదే ఏడాది జనవరి 1 నాటి వరకు చూసుకుంటే.. మొత్తం 15,89,468 పెండింగ్ కేసులు ఉంటే.. అందులో 3,72,162 సివిల్ కేసులు, 12,17,306 క్రిమినల్ కేసులు ఉన్నాయి. అయితే, 2023తో పోలిస్తే.. 2024లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గింది. రాజ్యసభలో మరొక ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ కోర్టులలో పెండింగ్ కేసులకు సంబంధించి న్యాయ మంత్రిత్వ శాఖ సమాధానాన్ని వెల్లడించింది. దీని ప్రకారం.. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి గుజరాత్‌లో 50 ఫ్యామిలీ కోర్టులు ఉన్నాయి. ఈ కోర్టులలో 2023లో 27,194గా ఉన్న కేసుల సంఖ్య ఈ ఏడాదిలో 44,037కు పెరగటం గమనార్హం. గతేడాది 30,084 కేసులు పరిష్కారం కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 50,128గా ఉన్నది. గుజరాత్‌లో గత నెల 21 నాటికి జిల్లా, సబార్డినేట్ కోర్టులలో 535 న్యాయాధికారుల పోస్టులు ఖాళీ ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణలో అనుమానాలపై 3న సమీక్ష

- కాంగ్రెస్‌కు ఎన్నికల సంఘం ఆహ్వానం

న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించినంతవరకు పారదర్శకతను పాటించామని ఎన్నికల కమిషన్ శనివారం పునరుద్ఘాటించింది. ఈ విషయంలో కాంగ్రెస్ వ్యక్తం చేసిన చట్టబద్ధమైన ఆందోళనలన్నింటినీ సమీక్షించగలమని హామీ ఇచ్చింది. దీనికోసం డిసెంబరు 3న సమావేశానికి రావాల్సిందిగా ఆ పార్టీని ఆహ్వానించింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలకు సంబంధించి వెల్లడించిన డేటాలో తీవ్రమైన అసమానతలు వ్యక్తమయ్యాయని కాంగ్రెస్ శుక్రవారం పేర్కొంది. ఓటర్లను ఏకపక్షంగా తొలగించారని, తది ఓటర్ల జాబితాలో ప్రతి నియోజకవర్గంలో 10 వేల మందికి పైగా ఓటర్లను చేర్చారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. పైగా పోలింగ్ రోజు సాయంత్రం 5గంటల నుండి ఎన్నికల కమిషన్ తది పోలింగ్ శాతం ప్రకటించిన రాత్రి 11.30గంటల మధ్య కాలంలో అసాధారణంగా ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు కమిషన్‌కు పార్టీ అత్యవసర మెమోరాండాన్ని అందచేసింది. ఈ అంశాలపై మరింత వివరంగా చర్చించేందుకు తక్షణమే ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేయాలని కోరింది.

ధన, అధికార దుర్వినియోగం : శరద్ పవార్

యావత్ ఎన్నికల యంత్రాంగాన్ని నియంత్రించడానికి అధికారాన్ని, ధనాన్ని దుర్వినియోగపరిచారని ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ విమర్శించారు. ఇవిఎంల దుర్వినియోగంపై నిరసన వ్యక్తం చేస్తూ సీనియర్ సామాజిక కార్యకర్త డాక్టర్ బాబా అధవ్ మూడు రోజుల పాటు చేపట్టిన ఆందోళ నేపథ్యంలో పవార్ ఆయనను కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా పవార్ మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ జరగనంత అక్రమాలు మహారాష్ట్ర పోలింగ్‌లో చోటుచేసుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవిఎంల్లో అవకతవకలు జరిగాయని ప్రతిపక్ష మహా వికాస్ అగాఢి (ఎంవిఎ) విమర్శించిన సంగతి విదితమే.

సిక్కింలో బస్సు నదిలో పడి ఆరుగురి మృతి

గ్యాంగ్‌టక్: సిక్కింలో బస్సు నదిలో పడి ఆరుగురు చనిపోయారు. శుక్రవారం సాయంత్రం బస్సు సిలిగురి నుంచి గ్యాంగ్‌టక్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఆరుగురు అక్కడికక్కడే చనిఓయారు. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బ్రేక్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

చట్టబద్ధంగా స్వచ్ఛంద మరణం !

- మరణ సహాయ బిల్లును ఆమోదించిన బ్రిటన్ ఎంపీలు

లండన్ : దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతూ, జీవించే ఇచ్ఛ లేక కుటుంబానికి భారంగా తయారయ్యామని బాధపడేవారు తమ జీవితాలను అంతమొందించుకోవడానికి సాయపడే మరణ సహాయ బిల్లు (కారుణ్య మరణాలు)ను బ్రిటన్ పార్లమెంట్ సభ్యులు ఆమోదించారు. అయితే ఇది తొలి అడుగు మాత్రమే. ఈ బిల్లుకు సూత్రప్రాయ ఆమోదమే లభించింది. దీనిపై తుదిగా ఓటింగ్ జరగడానికి ముందుగా మరింత కూలంకష పరిశీలన జరగనుంది. ఈ బిల్లు 330-275 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది. నైతిక విలువలు, విశ్వాసాలు, చట్టాలు, నిబంధనలు ఇలా పలు అంశాలపై సుదీర్ఘంగా గంటల తరబడి చర్చ సాగింది. అప్పుడప్పుడూ భావోద్వేగాలు కూడా చోటు చేసుకున్నాయి. శారీరక బాధలను నివారిస్తూ, గౌరవప్రదంగా చనిపోవడానికి ఈ బిల్లు మద్దతిస్తుందని దీన్ని సమర్ధించేవారు అంటున్నారు. కాగా ఈ చర్య వల్ల వికలాంగులు, వృద్ధులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ముప్పును ఎదుర్కొంటారని, తమపై భారాన్ని వదిలించుకోవడానికి లేదా డబ్బును ఆదా చేసుకోవడానికి కుటుంబ సభ్యులే వారిని అంతమొందిస్తారని ఈ బిల్లును వ్యతిరేకించే వారు వాదిస్తున్నారు. 18 ఏళ్ళు దాటి భయంకరమైన జబ్బులతో సుదీర్ఘంగా బాధపడుతున్నవారెవరైనా ఈ బిల్లు కింద స్వచ్ఛంద మరణాన్ని ఎంచుకోవచ్చు. తమ జీవితాలను అంతమొందించుకోవడమెలా అనే విషయంపై వీరికి సూచనలు అందించడమే ఈ బిల్లు లక్ష్యంగా వుంది. జీవన్మరణాల మధ్య గల చాయిస్ గురించి మనం మాట్లాడుకోవడం లేదని, బాధలతో చనిపోవాలనుకుంటున్నవారు ఎలా చనిపోవాలో చెప్పాలనుకుంటున్నామని ఈ బిల్లును ప్రతిపాదించిన కిమ్ లీడ్‌బీటర్ అన్నారు.



చదువంటే ప్రాణం



కృష్ణపట్టె అనే గ్రామంలో పాపయ్య, జానమ్మ కుటుంబం ఉంటోంది. వారికి ఒక అబ్బాయి కృష్ణ. కృష్ణ చదువులో చాలా చురుకుగా ఉండేవాడు. కొన్ని సంవత్సరాల తరువాత పాపయ్య దుర్వసనాలకు అలవాటు పడ్డాడు. కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. జానమ్మే కూలీకి పోయి కుటుంబాన్ని సాకుతోంది.

రోజులు చాలా కష్టంగా గడుస్తున్నాయి. కృష్ణకి రెండుపూటలా తిండిపెట్టడమే కష్టమౌతోంది. దీంతో జానమ్మ కృష్ణని చదువు మాన్పించేసింది. కృష్ణ బాగా ఏడ్చాడు. 'తన దగ్గర పుస్తకాలు, బట్టలు కొనేందుకు డబ్బులు లేవని, రోజూ తనతో పాటు పనికి రమ్మ'ని జానమ్మ కృష్ణతో ఏడుస్తూ చెప్పింది.

జానమ్మ, కృష్ణ రోడ్డు పక్కన సీసాలు ఏరే పనికి కుదిరారు. ఒకసారి వాళ్ళు వెళ్లే చోటుకి కాస్త దగ్గరగా హైస్కూలు ఉంది. అక్కడ ఒక తరగతి గదిని ఆనుకుని ఉన్న కిటికీ దగ్గర సీసాలు ఏరుతున్న కృష్ణకి, టీచర్ చెప్పే పాఠాలు బాగా వినిపించాయి. ప్రతి రోజూ అక్కడే పనిచేస్తూ పాఠాలు శ్రద్ధగా వింటున్నాడు. ఒకరోజు క్లాస్‌లో టీచర్ పిల్లలని ఉద్దేశించి ఒక ప్రశ్న అడిగారు. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. అప్పుడు కృష్ణ 'నేను చెబుతాను టీచర్' అన్నాడు. టీచర్ కిటికీ వైపు చూశారు. కృష్ణని లోపలికి రమ్మని చెప్పారు. టీచర్ అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పాడు కృష్ణ. టీచర్ చాలా సంతోషించారు.

'నీకు సమాధానం ఎలా తెలుసు? నువ్వు ఏ పాఠశాలలో చదువుతున్నావు?' అని అడిగారు.

'నేను ప్రస్తుతం ఎక్కడా చదువుకోవడం లేదు. మా అమ్మతో కలిసి సీసాలు ఏరడానికి ఇటువైపు వస్తాను. మీరు చెప్పే పాఠాలను రోజు వింటున్నాను' అని చెప్పాడు కృష్ణ. టీచర్ వెంటనే జానమ్మని పిలిచారు. కృష్ణ ఎందుకు స్కూలుకు వెళ్లడం లేదో విషయం తెలుసుకున్నారు. ఆ రోజు నుండి కృష్ణకి కావాల్సిన పుస్తకాలు, బట్టలు ఇస్తానని టీచర్, జానమ్మకి మాట ఇచ్చారు. రోజూ కృష్ణని స్కూలుకు పంపమని కూడా చెప్పారు. కృష్ణ ఎంతో సంతోషించాడు. మరుసటి రోజు నుండి కృష్ణను పాఠశాలకు పంపించసాగింది జానమ్మ.



– షేక్ ఫాతిమా
8వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, కోదాడ,
సూర్యాపేట, తెలంగాణ.

నా విహారయాత్ర



హాయ్ ఫ్రెండ్స్, ఇటీవల మా తరగతి పిల్లలందరినీ స్కూల్ యాజమాన్యం విహార యాత్రకు తీసుకువెళ్లారు. ఆ ప్రాంతం నాకు బాగా నచ్చింది. ముందుగా మేము జైనమందిరానికి వెళ్లి ప్రాంగణమంతా తిరిగి ఫొటోలు దిగాము. తర్వాత ఉప్పల పాడు పక్షుల కేంద్రానికి వెళ్లాం. అక్కడ ఎన్నో రకాల కొంగలను వాటి గూళ్ళను వాటి పిల్లల్ని కూడా చూసాము. అక్కడికి దగ్గర్లో ఉన్న ఖాళీ ప్రదేశంలో స్నేహితులందరం కలిసి భోజనం చేశాము. అక్కడే కొంతసేపు ఆటలాడుకున్నాము. అక్కడనుండి మంగళగిరి కొండపైకి స్కూల్ బస్సులో వెళ్ళాము. పై నుండి కిందకు చూస్తుంటే కింద ఇల్లు అన్నీ చిన్నవిగా కనిపించాయి. ఈ విహారయాత్ర ఎంతో సంతోషంగా, ఉల్లాసంగా గడిచింది. స్నేహితులందరితో గడిపిన సమయం చాలా బాగుంది.



– బస్. లాస్య,
3వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

నేను గీసిన బొమ్మ





ఎం.సుచేతన్,
6వ తరగతి,
హైదరాబాద్ కాకతీయ హై స్కూలు,
బాలాజీ నగర్, సూర్యాపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రాణాంతక వ్యాధికి పదునైన చికిత్స



– డాక్టర్ యనమదల మురళీకష్ణ
ప్రముఖ సాంక్రమిత వ్యాధుల నివారణ నిపుణుడు,
కాకినాడ. సెల్ : 94406 77734

కోవిడ్... ఎయిడ్స్... గుండెపోట్లు... ఇలా భయంకరమైన వ్యాధులు ఏమైనా వాటి నియంత్రణ కోసం ఆయన అనేక పరిశోధనలు చేశారు. మన రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన డాక్టర్లలో ఆయన పేరు అగ్రస్థానంలో ఉంటుంది. భయపెట్టే రోగాలను సులభంగా ఎలా ఎదిరించాలో ప్రజానీకానికి తెలియజేశారు. బాధితుల్లో ధైర్యాన్ని నింపటమే కాకుండా, సులభమైన మెళకువలు పాటించటం ద్వారా సాంక్రమిత వ్యాధుల నుంచి ఎలా భయటపడొచ్చో వివరిస్తున్నారు. భయంకరమైన రోగాలున్న వారిని సైతం ఆదరించి అక్కున చేర్చుకొని వైద్యం అందించి వారి ప్రాణాలను కాపాడేస్తుంటారు. ధైర్యంగా ఉంటే రోగం నయమవుతుందని ఊపిరిలూదుతుంటారు. ఆయనే ప్రముఖ సాంక్రమిత వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ. కాకినాడలో గత 24 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తూ ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు.



డాక్టర్ యనమదల మురళీకృష్ణ... మూడు దశాబ్దాలుగా ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు తనవంతుగా కృషిచేస్తున్నారు. కేవలం రెండు ఔషధాలతో హెచ్ఐవిని జీరో లోడ్‌కు చేర్చొచ్చునని 20 ఏళ్ల క్రితమే ప్రయోగాత్మకంగా ఆయన నిరూపించారు. శాస్త్రీయ ఆధారాలతో 2004లో ఫ్రాన్స్‌లో జరిగిన సదస్సులో పరిశోధనా సారాంశాన్ని సైతం సమర్పించారు. కాల పరీక్షలో నెగ్గిన ఈ చికిత్సా విధానం ఇప్పుడు ప్రపంచానికి ప్రామాణికంగా నిలిచింది. 1996 నుంచి ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి చికిత్సలో మూడు లేదా అంతకంటే ఎక్కువ ఔషధాల కాంబినేషన్‌ను అమలు చేస్తున్నారు. 2000 నుంచి డాక్టర్ మురళీకృష్ణ ప్రధానంగా రెండు ఔషధాల కాంబినేషన్‌లతోనే వైద్యాన్ని అందిస్తున్నారు. హెచ్ఐవి వైరల్ లోడును కనిష్టంగా (అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు గుర్తించలేనంత) తక్కువస్థాయి (అన్‌డిటెక్టబుల్)కి తీసుకురావటమనేది హెచ్ఐవి (యాంటీ రెట్రో వైరల్) ట్రీట్మెంట్ ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన యాంటీ రెట్రో వైరల్ ఔషధాల సంఖ్య 25కు పైనే ఔషధాలు ఉన్నాయి. గతంలో హెచ్ఐవి చికిత్స తీసుకోని (యాంటీ రెట్రోవైరల్ నైవ్) పేషెంట్స్‌లో రెండు ఔషధాల కాంబినేషన్ చికిత్స మెరుగైన ఫలితాలు ఇస్తుందని ఆయన ప్రపంచానికి చాటిచెప్పారు. అందుబాటులోని మందులు, హెచ్ఐవి క్రిమిపై పూర్తి అవగాహనతో ఇలా రెండు యాంటీ రెట్రో వైరల్ ఔషధాల కాంబినేషన్ చికిత్స మెరుగైన ఫలితాలను అందిస్తుందని తన అధ్యయనాలతో నిరూపించారు. ఈ విషయమై శాస్త్రీయ ఆధారాలతో 2004లో ఫ్రాన్స్‌లో జరిగిన 13వ ఇంటర్నేషనల్ సింపోజియం ఆన్ హెచ్ఐవి, ఎమర్జింగ్ ఇన్ఫెక్షన్ డిసీజెస్ సదస్సులో యనమదల పరిశోధనా సారాంశాన్ని సమర్పించారు. 2022 చివరి నుండి ఈ రెండు ఔషధాల కాంబినేషన్ చికిత్సను ఒక విధానంగా అన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ చికిత్స మార్గదర్శకాలలో చేర్చారు. కొత్తగా హెచ్ఐవి నిర్ధారించబడిన వారికి రెండు ఔషధాల యాంటీ రెట్రో వైరల్ కాంబినేషన్ చికిత్స విధానాన్ని ఇవ్వొచ్చునని సూచించారు.

> **చికిత్సలకు ప్రపంచస్థాయి ప్రాచుర్యం**
> *2000 ప్రారంభం నుంచి నేను ఎక్కువ మందికి రెండు ఔషధాల కాంబినేషన్ వైద్యాన్ని అందిస్తున్నా. 2022 సెప్టెంబరులో అమెరికా ప్రభుత్వ హెచ్ఐవి చికిత్సా మార్గదర్శకాలు, అక్టోబర్‌లో యూరోపియన్ ఎయిడ్స్ క్లినికల్ సొసైటీ మార్గదర్శకాల్లోనూ ఈ రెండు ఔషధాల కాంబినేషన్ చికిత్సను చేర్చారు. కాలపరీక్షలో నెగ్గిన నా చికిత్సా విధానం ఇప్పుడు ప్రపంచానికి ప్రామాణికంగా ఉంది.*

రోగుల జీవన ప్రమాణాల పెంపు

గత 24 సంవత్సరాల్లో డాక్టర్ మురళీకృష్ణ 6500 మందికి పైగా హెచ్ఐవి బాధితులకు చికిత్సలు చేశారు. వారి జీవిత కాలాన్ని వృద్ధి చేసి, జీవన ప్రమాణాలను పెంచేశారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీలో ఎండి చేసిన ఆయన 1997 నుంచి హెచ్ఐవి నియంత్రణ కోసం నిరంతరం తన కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు. హెచ్ఐవి రోగుల్లో వ్యాధి తీవ్రత అంచనాకు సీడీ4 లింఫోసైట్ కణాల సంఖ్య, హెచ్ఐవి వైరల్ లోడ్ పరీక్షలు చేస్తారు. ఇవి బాగా ఖరీదైనవి. అన్ని చోట్లా లభ్యం కావు. ఎయిడ్స్ జబ్బులో అధికంగా ప్రాణాలు తీసేది క్షయ వ్యాధి. దీని భారిన పడిన రోగుల్లో ఖరీదైన పరీక్షల స్థానంలో చౌకగా దొరికే 'మాంటూ' (ట్యుబర్ క్యులిన్) పరీక్షను ఉపయోగించొచ్చునని మురళీకృష్ణ ప్రతిపాదించారు. హెచ్ఐవి జబ్బులో క్షయవ్యాధి గురించి శాస్త్రీయ పరిశోధన చేశారు. 2000లో దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో జరిగిన 13వ అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సులో తన పరిశోధనా సారాంశ పత్రాలను ఆయన సమర్పించారు. ఆ సదస్సుకు ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన 5000 పైగా పరిశోధనల్లో 25 అత్యుత్తమ పరిశోధనలను ఎంపిక చేసి అతిపెద్ద మెడికల్ వెబ్‌సైట్ 'మెడ్ స్కేప్' ప్రచురించింది. డాక్టర్ మురళీకృష్ణ పరిశోధనకు మెడ్ స్కేప్ ఎంపిక చేసిన అత్యుత్తమ పరిశోధనల్లో చోటు దక్కడం తెలుగు వారికి గర్వ కారణం.

వైద్య సాహిత్యంతో ప్రజలకు భరోసా

హెచ్ఐవిపై వివిధ పత్రికల్లో 50 వరకు పరిశోధనాత్మక వ్యాసాల ద్వారా మురళీకృష్ణ ప్రజల్లో అవగాహన కల్పనకు కృషిచేశారు. 2000లో ఆయన ప్రచురించిన 'ఎయిడ్స్' పుస్తకం గొప్ప జనాదరణ పొందింది. కోవిడ్ పీడ సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ భరోసానిచ్చారు. పలు టీవీ చర్చల్లో పాల్గొని ప్రజలకు భరోసాని ఇచ్చారు. 'కోవిడ్–ఎయిడ్స్–నేను' పేరుతో 2022 జనవరిలో ఆయన ప్రచురించిన ఆత్మ కథాత్మక వైద్య ఆరోగ్య గ్రంథం మేధావులు, సామాన్యుల నుంచి ఆదరణ చూరగొంది. 2024 మార్చిలో 'హెచ్ఐవి ఎయిడ్స్' పుస్తకాన్ని తెలుగులో ప్రచురించారు. మే నెలలో 'హెచ్ఐవి ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్' పుస్తకాన్ని వెలువరించారు.

హోమ్‌కేర్‌తో కరోనా నుంచి విముక్తి

ఏస్పిరిన్ – ప్రెడ్నిసొలన్ – ఎజిత్రోమైసిన్‌లతో తేలికపాటి కోవిడ్ జబ్బుకి ఇంటి వద్దనే చికిత్స తీసుకోవడానికి రూపొందించిన ఈ కిట్టు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మందికి భరోసాను ఇచ్చింది, వేలాది మందికి ప్రాణాలను నిలిపింది. కోవిడ్ తర్వాత ఏస్పిరిన్ వాడకంతో గుండె పోటు ముప్పును నివారించొచ్చునని తెలియజేశారు.

జిమా ప్రశంసతో ప్రత్యేక గుర్తింపు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), దేశంలో అత్యధిక వైద్యులు చదివే 'జర్నల్ ఆఫ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్' (జిమా) డాక్టర్ మురళీకృష్ణ కృషికి ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చింది. ఎయిడ్స్ వ్యాధి విస్తృతంగా వ్యాపించిన అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాధి తీరు తెన్నులను గురించి ఈ ఏడాది మేలో ప్రచురించిన 'హెచ్ఐవి ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్' పుస్తకాన్ని జాతీయస్థాయిలో జర్నల్ ఆఫ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నవంబరు 2024 సంచికలో విశేషంగా ప్రస్తావించారు. వృద్ధిలో ఉన్న దేశాలు, పేద దేశాల నుండి ఇంతవరకు ఎయిడ్స్ పై ఈ తరహా పుస్తకాలు లేని లోటును ఈ పుస్తకం పూరించిందన్నారు. డాక్టర్ మురళీకృష్ణ లోతైన అధ్యయనం, విస్తృత అనుభవంతో రాసిన ఈ పుస్తకం వైద్యులు – ఆరోగ్య విధానకర్తలు – సామాన్యులకు కూడా ఎయిడ్స్ జబ్బు గురించి తగిన అవగాహన ఇస్తుందనటంలో సందేహం లేదు.

– యడవల్లి శ్రీనివాసరావు

పుష్ప-2 టికెట్ ధరల పెంపు... బెనిఫిట్ షోలకూ అనుమతి



అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప 2: ది రూల్'. రష్మిక మందన్న హీరోయిన్. డిసెంబర్ ఐదో తేదీన ఈ సినిమా విడుదల కానుంది. తెలంగాణా వ్యాప్తంగా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటలకు బెనిఫిట్‌షోతో పాటు అర్ధరాత్రి 1 గంట షోకు కూడా అనుమతి ఇచ్చింది. రాత్రి 9.30 షోకు టికెట్ ధరను అదనంగా రూ.800 పెంచింది. ఈ షో చూడాలంటే రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ ఏదైనా సరే ప్రస్తుతం ఉన్న టికెట్ ధరకు అదనంగా రూ.800 చెల్లించాల్సిందే. ఈ పెంపుతో సింగిల్ స్క్రీన్‌లో టికెట్ ధర ర.1000 అవుతుండగా, మల్టీప్లెక్స్‌లో రూ.1200లకుపైగా అవుతుంది. ఇక అర్ధరాత్రి 1 గంట నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకూ అదనపు షోలకు అనుమతి ఇచ్చారు. డిసెంబర్ 5 నుంచి 8 వరకూ సింగిల్ స్క్రీన్లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచారు. 9 నుంచి 16 వరకూ సింగిల్ స్క్రీన్లలో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతి ఇచ్చారు. 17 నుంచి 23 వరకూ సింగిల్ స్క్రీన్లలో రూ.20, మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పుష్ప 2 ఆరు భాషల్లో 12 వేలకుపైగా థియేటర్లలో విడుదల కానుంది. అత్యధిక థియేటర్లలో ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతున్న భారతీయ చిత్రమిది. సినీడబ్స్ యాప్ సహాయంతో ఏ భాషలోనైనా ఈ సినిమాను ఆస్వాదించే అవకాశం ఉందని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బుకింగ్స్ ప్రారంభంకాగా రికార్డుస్థాయిలో టికెట్ల విక్రయాలు ఓవర్సీస్‌లో జరిగాయి. ఈ సినిమాలో అల్లు అర్జున్ రూ.300 కోట్లు వరకూ పారితోషికం తీసుకున్నట్లుగా తెలిసింది. ఫోర్బ్స్ ఇండియా 2024 అత్యధిక పారితోషికం తీసుకున్న టాప్ 10 నటుల్లో అల్లు అర్జున్ మొదటి స్థానంలో ఉన్నారని ప్రకటించింది.

కొత్త ఎన్‌టిఆర్ హీరోయిన్



నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు.. తారక రామారావు హీరోగా వై.వి.ఎస్.చౌదరి కొత్త సినిమాను తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. 'న్యూ టాలెంట్ రోర్స్' పతాకంపై ఆయన సతీమణి గీత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందించనున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన వీణారావు నటిస్తున్నారు. ఆమెను పరిచయం చేసేందుకు వై.వి.ఎస్.చౌదరి శనివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వీణారావు కూచిపూడి డ్యాన్సర్ అని, అచ్చతెలుగు అమ్మాయి అని తెలిపారు. సుప్రియ, స్వప్నదత్ వీణారావును పరిచయం చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సుప్రియ మాట్లాడుతూ.. 'వైవీఎస్ చౌదరి కొత్తవారిని పరిచయం చేయడంలో ముందుంటారు. తన కెరీర్‌లో ఎంతోమంది కొత్తవారిని ఇండస్ట్రీకి పరిచయం చేశారు. వీణారావు ఎన్నో సినిమాలు చేయాలని కోరుకుంటున్నా' అన్నారు. తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలోకి రావాల్సిన సమయమిదని మరో నిర్మాత స్వప్నదత్ అన్నారు. విజయవాడ అమ్మాయి హీరోయిన్‌గా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీనియర్ ఎన్టీఆర్ నటించిన 'యుగంధర్' సినిమా 1979 నవంబర్ 30న రిలీజైందని.. అందుకే ఈ రోజున వీణారావును పరిచయం చేయాలనుకున్నట్లు వైవీఎస్ చౌదరి తెలిపారు.

'ఆర్‌సి-16' దివ్యేందు శర్మ



రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబినేషనల్లో వస్తోన్న 'ఆర్‌సి–16' చిత్రంలో బాలీవుడ్ వెబ్ సిరీస్ 'మీర్జాపూర్'తో ఇండియన్ వైడ్‌గా ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకున్న దివ్యేందు శర్మ నటిస్తున్నట్లు తాజాగా చిత్రబృందం ప్రకటించింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై ఈ చిత్రం రూపొందుతోంది. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

13న 'పా...పా' విడుదల



తమిళంలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'డా...డా' సినిమా తెలుగులో 'పా...పా' టైటిల్‌తో ఈనెల 13న విడుదల కాబోతోంది. జెకె ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. కవిన్, అపర్ణదాస్ ప్రధాన పాత్రధారులుగా డైరెక్టర్ గణేష్ కె బాబు తెరకెక్కించిన 'డా...డా' చిత్రం తమిళ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'డా...డా' చిత్రం 'పా...పా..' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుందని నిర్మాత నీరజ కోట తెలిపారు. కామెడీ, భావోద్వేగం, ప్రేమ... ఇవన్నీ సరైన స్థాయిలో ఉండి ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమా ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంజిఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేయబోతున్నారన్నారు.



13న 'ప్రణయ గోదావరి' విడుదల

పల్లెటూరి ప్రేమ కథ నేపథ్యంలో రూపొందించిన తాజా చిత్రం 'ప్రణయ గోదావరి'. సదన్, ప్రియాంకా ప్రసాద్ నటీనటులు. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారుమళ్ళ లింగయ్య నిర్మించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 13న విడుదల చేస్తున్నారు. సాయికుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. అనంతరం సాయికుమార్ ఒక్కరే ఉన్న పోస్టర్‌ను మేకర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పాటలు, పోస్టర్లకు మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా అందరూ చూడదగిన చిత్రమన్నారు. అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించామని వివరించారు.

తొలి రోజు వర్షార్పణం

• కాన్‌బెర్రాలో ఎడతెగని వర్షం • నేడు 50 ఓవర్ల వార్మప్‌కు అవకాశం

రెండు రోజుల టూర్ గేమ్‌లో గులాబీ బంతిపై సాధన చేయాలని ఆశించిన టీమ్ ఇండియాకు వరుణుడు అడ్డు తగిలాడు. మానుకా ఓవల్‌లో రోజంతా ఎడతెగని వర్షం కురవటంతో తొలి రోజు ఆట సాధ్యపడలేదు. నేడు వర్షం సూచనలు లేకపోవటంతో ఇరు జట్లు 50 ఓవర్ల ఫార్మాట్‌లో వార్మప్ మ్యాచ్ ఆడేందుకు అవకాశం ఉంది.



కాన్‌బెర్రా : ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్ ఇండియా ఆడాల్సిన ఏకైక వార్మప్ మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కలిగించాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టు ముంగిట జరగాల్సిన అంతర్గత జట్టు వార్మప్ మ్యాచ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ రద్దు చేయగా.. పింక్ బాల్ టెస్టుకు ముందు కాన్‌బెర్రాలో రెండు రోజుల టూర్ గేమ్ షెడ్యూల్ చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వార్మప్ మ్యాచ్‌లో తొలి రోజు వర్షార్పణం అయ్యింది. వార్మప్ మ్యాచ్‌లో ఆదివారం మాత్రమే మిగిలి ఉంది. దీంతో టెస్టు ఫార్మాట్‌లో కాకుండా.. వైట్‌బాల్ ఫార్మాట్‌లో ఇరు జట్లు 50 ఓవర్ల చొప్పున ఆడేందుకు అవకాశం ఉంది. దీనిపై ఆదివారం ఉదయం మ్యాచ్ అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. భారత్, ప్రధానమంత్రి ఎలెవన్ జట్ల మధ్య నేడు టాస్ కూడా సాధ్యపడలేదు.

ఆఖరు అవకాశం! : భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు ఆడిలైడ్‌లో జరుగనుంది. డిసెంబర్ 6 నుంచి పింక్ బాల్ డే నైట్ టెస్టు ఆరంభం కానుంది. చివరగా భారత్ ఇక్కడ ఆడిన డే నైట్ టెస్టులో దారుణ పరాజయం చవిచూసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 36 పరుగులకే కుప్పకూలి అత్యంత చెత్త రికార్డు మూటగట్టుకుంది. తాజా సిరీస్‌లో పెర్త్ టెస్టులో 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన టీమ్ ఇండియా.. ఆడిలైడ్ టెస్టులో సైతం ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. కానీ, పింక్ బాల్‌పై టీమ్ ఇండియాకు మంచి సాధన లేదు. వార్మప్ మ్యాచ్ సైతం వర్షం అంతరాయంతో ఒక్క రోజు మ్యాచ్‌కు మారనుంది. సోమవారం కాన్‌బెర్రా నుంచి ఆడిలైడ్‌కు వెళ్లనున్న టీమ్ ఇండియా అక్కడ నెట్స్‌లో పగలు సహా రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పింక్ బాల్‌ను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు తయారు చేసింది. బొటనవేలు గాయంతో తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్, పితృత్వ సెలవులో ఉండటంతో పెర్త్ పోరులో ఆడలేకపోయిన రోహిత్ శర్మ.. వార్మప్ మ్యాచ్‌లో ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. పెర్త్ టెస్టులో ఓపెనర్‌గా మంచి ప్రదర్శన చేసిన కేఎల్ రాహుల్ బ్యాటింగ్ లైనప్‌లో మూడో స్థానంలో ఆడే అవకాశం కనిపిస్తోంది.

హాజిల్‌వుడ్ అవుట్ : సుదీర్ఘ విరామం తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తిరిగి సొంతం చేసుకోవాలని చూస్తున్న ఆస్ట్రేలియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పెర్త్ టెస్టులో భారత బ్యాటర్లను నిలకడగా ఇబ్బంది పెట్టిన, బంతి అందుకున్న ప్రతిసారి వికెట్ వేటలో భయపెట్టిన పేసర్ జోశ్ హాజిల్‌వుడ్. భారత బ్యాటర్ల అసమాన బ్యాటింగ్ ప్రదర్శనతో హాజిల్‌వుడ్‌కు పెద్దగా వికెట్లు దక్కలేదు. కానీ హాజిల్‌వుడ్ ఒక్కడే ఆసీస్ పేసర్లతో గొప్పగా బంతులేశాడు. డిసెంబర్ 6 నుంచి ఆరంభం కానున్న ఆడిలైడ్ డే నైట్ టెస్టుకు హాజిల్‌వుడ్ అందుబాటులో ఉండటం లేదు. పక్కటెముల కండరాల గాయంతో హాజిల్‌వుడ్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో స్కాట్ బొలాండ్ టెస్టులో చోటు సాధించాడు. ఈ సీజన్‌లో బొలాండ్‌కు టెస్టుల్లో అవకాశాలు దక్కలేదు. కానీ పింక్ బాల్ టెస్టులో బొలాండ్‌కు మంచి రికార్డుంది. ఆడిన రెండు టెస్టుల్లో బొలాండ్ 13.71 సగటు కలిగి ఉన్నాడు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బొలాండ్ బంతిని అద్భుతంగా సీమ్ చేయగలడు. దీంతో భారత్‌కు సవాల్ విసిరేందుకు ఆసీస్ జట్టు మేనేజ్‌మెంట్ బొలాండ్‌ను ఎంచుకుంది.

టైటిల్ పోరుకు సింధు

● సయ్యద్ మోడీ ఇండియా ఓపెన్



లక్నో (ఉత్తరప్రదేశ్) : సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ ఓపెన్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు టైటిల్ పోరుకు చేరుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ సింధు 21-12, 21-9తో వరుస గేముల్లో అలవోక విజయం సాధించింది. సహచర భారత షట్లర్ ఉన్నతి హుడా నుంచి సింధుకు పెద్దగా పోటీ ఎదురు కాలేదు. నేడు ఫైనల్లో చైనా షట్లర్ వు యుతో సింధు తలపడనుంది. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ 18-21, 21-18, 21-10తో మూడు గేముల మ్యాచ్‌లో థాయ్‌లాండ్ జోడీపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ, సాయి ప్రతీక్ 21-17, 17-21, 21-16తో ఇషాన్, శంకర్‌లపై విజయం సాధించి టైటిల్ పోరులో అడుగు పెట్టారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల్, తనీశ క్రాస్టో జంట సైతం 21-16, 21-15తో వరుస గేముల్లో విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. పురుషుల సింగిల్స్‌లో సెమీస్‌లో ప్రియాన్షు రజావత్ 13-21, 19-21తో పరాజయం పాలయ్యాడు. టాప్ సీడ్ లక్ష్యసేన్ 21-8, 21-14తో జపాన్ షట్లర్‌పై విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టాడు.

అండర్-19 ఆసియా కప్‌లో
టీమిండియా ఓటమి

దుబాయ్ : అండర్-19 ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 43 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 282 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ 238 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్... నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. ఓపెనర్ షాజైబ్ ఖాన్ 150 పరుగులు, మరో ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ 60 పరుగులు చేసి పాకిస్తాన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఛేదనకు దిగిన భారత్ బ్యాటర్లు ఏ దశలోనూ పెద్ద భాగస్వామ్యాలు నెలకొల్పలేదు. మిడిలార్డర్ బ్యాటర్ నిఖిల్ కుమార్ 67 పరుగులు చేశాడు. టెయిలెండర్లు యుదాజిత్ గుహ 12 పరుగులు, మహ్మద్ ఈనాన్ 30 పరుగులు చేసి పదో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, భారత్ ఓటమి అంతరాన్ని తగ్గించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68